ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి జిల్లా వార్తలు

శుక్రవారం 17 మే 2024 5

రేపటి నుంచి సత్యదేవుడి కల్యాణోత్సవాలు 7

వరదలను సమర్థంగా ఎదుర్కొందాం

గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీర్ సతీష్‌కుమార్



భద్రత ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ మాధవీలత
సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఈవీఎంలకు మూడంచెల భద్రత

- నన్నయలో కట్టుదిట్టంగా భద్రత ఏర్పాట్లు..
- నిరంతర సీసీ కెమెరాల పర్యవేక్షణ
- ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్, ఎస్పీ

రాజానగరం, మే 16 : ఆదికవి నన్నయ వర్శిటీలోని స్ట్రాంగ్ రూమ్ వద్ద 24/7 మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని.. కేంద్ర బలగాలు పహరా కాస్తున్నాయని జిల్లా ఎన్నికల అధికారి డా.కె.మాధవీలత తెలిపారు. ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి గురువారం సాయంత్రం ఆమె ఇక్కడ ఏర్పాట్లు పరిశీలించారు.ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు నన్నయ వర్శిటీలో భద్రపరచిన సంగతి విదితమే. ఈ మేరకు భద్రత ఏర్పా జూన్ 4న జరిగే కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. కేంద్ర ఆర్మ్‌డ్, పోలీసు ఫోర్స్, మొబైల్ టీమ్ ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమేరా పర్యవేక్షణ కట్టుదిట్టంగా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఏడు అసెంబ్లీ, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి బ్యాలెట్, కంట్రోలు యూనిట్స్, వీవీ ప్యాట్స్ పకడ్బందీగా భద్రపరిచామన్నారు. కౌంటింగ్‌కు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఏర్పాట్లు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడు షిఫ్ట్‌లలో బందోబస్తు, గెజిటెడ్ అధికారుల పర్యవేక్షణ ఉందన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా పెట్టామన్నారు.స్ట్రాంగ్ రూమ్‌లలో ఎటువంటి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా ఉండడంకోసం విద్యుత్ సరఫరా నిలిపివేయాలని ఆదేశించారు. ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ నన్నయ వర్శిటీ వద్ద డీఎస్పీ, సీఐ, మొబైల్ టీమ్, సీఆర్పీఎఫ్, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు, రాష్ట్ర పోలీసుల ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు.కౌంటింగ్ ముగిసే వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.సమావేశంలో రిటర్నింగ్ అధికారులు ఎస్.తేజ్‌భరత్, కె.దినేష్‌కుమార్,అశుతోష్‌మిశ్రా,ఎ.చైత్రవర్షిణి, ఎం.మాధురి,రమణ నాయక్,కె ఎల్ శివజ్యోతి, అదనపు ఎస్పీలు ఎల్.చెంచిరెడ్డి, కృష్ణనాయక్ పాల్గొన్నారు.



అమ్మో రూ.200

మార్కెట్‌లో నకిలీ నోట్లు చలామణి

అనపర్తి, మే 16 : జిల్లాలో నకిలీ నోట్ల చలామణి పెరిగింది.. రూ.100, 200,500 నోట్లు నకిలీ మకిలీ అంటించుకున్నాయి. దీంతో దుకాణాల వద్ద ఏ నోటు ఇచ్చినా అయ్యబాబోయ్ అంటున్నారు.. ఒకసారి చూసి తీసుకుంటున్నారు. నకిలీ నోటు పట్ల అవగాహన ఉన్న వారు పరవాలేదు.. లేని చిరు వ్యాపారులు మాత్రం భారీగా మోసపోతున్నారు. అనపర్తిలో నకిలీ నోట్ల చలామణీ ఇటీవల ఊపందుకుంది. గతంలో రూ.500,రూ.1000 నకిలీ నోట్ల చలామణి అధికంగా జరిగేది. అయితే పెద్ద నోట్ల రద్దు తరువాత నకిలీ నోట్ల చలామణీ గణనీయంగా తగ్గింది. గతంలో కొత్త రూ.500 నకిలీ నోట్లు వచ్చినప్పటికీ పెద్దగా ప్రభావం చూపలేదు. ప్రస్తుతం మార్కెట్‌లో నకిలీ రూ.200 నోట్లు చలామణిలోకి రావడంతో ఇటు ప్రజలు అటు వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. అనపర్తిలో అయితే రూ.200నోటు చూడగానే అమ్మో రూ.200 నోటా అంటూ పరిశీలించి మరీ తీసుకుంటున్నారు. ఈ నోట్ల చలామణితో అనేక మంది పేదలు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. అనపర్తి పరిసరాల్లో నోట్ల తయారీ కేంద్ర ఉండి ఉండవచ్చనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.ఎటువంటి అనుమానం రాకుండా అసలు నోట్లకు దీటుగా రూ.200 నోటు ఉండటంతో పరీక్షగా చూస్తే తప్ప తేడాను కనిపెట్టలేకపోతున్నారు.చిన్న నోటు అయితే పెద్దగా ఇబ్బంది ఉండదనే కోణంలో రూ.200 నోట్లు చలామణిలోకి తెచ్చి ఉంటారని సమాచారం.నోట్ల చలామణీ పెరిగి సామాన్యులు ఇబ్బందులు పడకుండా పోలీస్ యంత్రాంగం నకిలీ నోట్ల తయారీపై దృష్టి సారించాలని వ్యాపారులు కోరుతున్నారు.



రూ.40 కోట్లు!

ఇదీ ఒక్కో అభ్యర్థి ఖర్చు



- మారిన ఎన్నికల రాజకీయం
- ఆర్థిక బలం ఉన్న వారే అభ్యర్థులు
- నోటుకు పడిపోయిన ఓటు
- నియోజకవర్గం ఖర్చు రూ.100 కోట్లు
- రిజర్వు స్థానాల్లోనూ మారిన సీన్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజకీయాలు పూర్తిగా వ్యాపారం అయ్యాయి. ఎన్నికలు మరీ ఖరీదయ్యాయి. ప్రజాస్వామ్యంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలే కాదు. ఓ మోస్తరు కోటీశ్వరులు ఎన్నికలను ఎదుర్కోలేని పరిస్థితి. రాజకీయ పార్టీలు టికెట్లు ఇచ్చే సమయంలో కూడా అభ్యర్థి ఆర్థిక పరిస్థితిని ప్రామాణికంగా తీసుకుంటున్నారు. రిజర్వు స్థానాల్లోనూ ఎంతో కొంత ఆర్థికంగా బలీయులైనవారికే సీట్లు దక్కే అవకాశం ఉంది.ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ఒక్కో అభ్యర్థి రూ.25 కోట్ల నుంచిరూ.40 కోట్ల వరకూ ఖర్చు చేసినట్టు ప్రచారం జరుగుతోంది.

ఖర్చు జరిగిందిలా..

ఎన్నికల కమిషన్ ఎన్ని ఆంక్షలు పెట్టినా.. ఎంత నిఘా పెట్టినా.. ఖర్చు లేకుండా ఎన్నికలు జరగడం లేదు. పైగా ఈసారి షెడ్యూల్ మార్చి 16వ తేదీన వచ్చింది.నోటిఫికేషన్ ఏప్రిల్ 18వ తేదీన జారీ అయింది. గడువు ఎక్కువగా ఉండడంతో క్యాడర్‌ను వెనుకతిప్పుకోవడానికే ఖర్చు ఎక్కువైంది. దీంతో అభ్యర్థికి మొదటి నుంచీ ఖర్చు తప్పలేదు. వార్డు ఇన్‌చార్జిలు, ముఖ్యులకు ముందుగా కనీసం రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ముట్టచెప్పాలి. గ్రామాల్లో నేతలకు, ముఖ్య క్యాడర్‌కు ఎంతో కొంత ఇవ్వాలి. అభ్యర్థుల తుది జాబితా వచ్చిన తర్వాత ప్రతి రోజూ ప్రతి ఊళ్లోనూ ప్రచారాలు ఉంటాయి. వీటికి చాలా ఖర్చవుతుంది. ప్రచారం నుంచి నామినేషన్ దాఖలు చేసే వరకూ ప్రతిరోజూ కనీసం 25 మందికి తగ్గకుండా మనిషికి రూ.500 వంతున ఇచ్చి జనాన్ని తీసుకొచ్చారు. నామినేషన్ రోజున ఈ సంఖ్య మరింత పెరిగింది. ఇక పోలింగ్ రోజుకు రెండు రోజుల ముందు నుంచే ఓటర్లకు పంపిణీ చేశారు. ఈ సారి నెలకు ముందే అధికార వైసీపీ చీరలు,కుక్కర్లు వంటివి ఇవ్వడం అలవాటు చేసింది. ఓటర్లకు పోలింగ్‌కు ముందు రూ.1000 నుంచి రూ.2500 వరకూ ఇచ్చారు. నియోజకవర్గంలో సుమారు 2 లక్షల మంది ఓటర్లు ఉంటే.. అందులో సుమారు లక్ష ఓట్లను కొనాల్సిన పరిస్థితి. ఇతర పార్టీ వాళ్లను కూడా కొనే ప్రయత్నం చేయగా, కొందరు తమ ఓటరు కాదనుకునేవాళ్లకు పైసా కూడా ఇవ్వకూడదని నిర్ణయించుకోవడం గమనార్హం. కొన్ని ప్రాంతాల్లో ఓటర్లకు డబ్బులు ఇవ్వకుండా తాయిళాలు పంచడానికి రూ.కోట్లు ఖర్చయింది.కొందరు మధ్యవర్తులు చేతివాటం చూపించడం గమనార్హం. ఈసారి అభ్యర్థులు చాలా పగడ్బందీగా పంపిణీ చేసినప్పటికీ చాలా చోట్ల చేతివాటం జరిగింది.ఆయా వార్డులు, గ్రామాల్లో పనిచేసే నేతలు,డబ్బు పంపిణీలో కీలకంగా వ్యవహరించే వ్యక్తులు కొందరికి ఇచ్చి, కొందరికి ఇవ్వకుండా చేసిన ప్రయత్నాలు ఉన్నాయి.ఇది అభ్యర్థికి తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి. తనకు తెలిసిన వాళ్లను ఎవరినైనా తోడుగా పెట్టి పంపిణీ చేద్దామంటే అదిగో.. మా మీద నమ్మకం లేనప్పుడు మేం ఎందుకు పనిచేయాలని బెదిరింపులు.ఇటువంటి పరిస్థితుల్లో అభ్యర్థులు రూ.కోట్లు ఖర్చు చేశారు. మీడియాలో ప్రచారానికి, మద్యం ..భోజనాలు ఇలా అంతా ఖర్చే. జిల్లాలో రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు,ఏడు అసెంబ్లీ నియోజవర్గాలు ఉన్న సంగతి తెలిసిందే. పార్లమెంట్ అభ్యర్థికి మరింత ఎక్కువ ఖర్చు ఉంటుంది. పార్లమెంట్ అభ్యర్థి తన ఖర్చు తాను చూసుకోవడంతో పాటు, ఇబ్బందిగా ఉన్న చోట్ల తమ పార్టీ అసెంబ్లీ అభ్యర్థులకు డబ్బు ఇవ్వవలసిన పరి స్థితి ఉంటుంది.ఇలా ప్రతీ నియోజకవర్గంలో ఓట్ల కోసం కోట్లు కుమ్మరించారు. ఒక్కో నియోజకవర్గంలో కనీస ఖర్చు రూ.25 కోట్లుగా ఉంటే ఎక్కువ ఖర్చు రూ.40 కోట్లకు పైగా ఉందని అంచనా.ప్రధాన పార్టీ అభ్యర్థులకే ఎక్కువ ఖర్చు ఉంటుంది.స్వతంత్ర అభ్యర్థులు నామమాత్రమే. ఎవరైనా విరాళాలు ఇస్తారేమోనని ఎదురు చూసేవారు ఉంటారు.

నిఘా విఫలం

ఎన్నికల కమిషన్ నియమావళి చాలా బాగుంటుంది. ఓటర్లను ఎవరూ ప్రలోభపెట్టకూడదు. అభ్యర్థులు కూడా చాలా పరిమితంగా వ్యయం చేయాలి. కానీ వీటిని అమలుచేయడానికి నియమితులైన అధికారులు ప్రలోభాలకు లోబడడం వల్ల ఎన్నికల కమిషన్ ఆశయం నీరుగారిపోతోంది.. ఎన్ని చెక్‌పోస్టులు పెట్టినా, ఎన్ని మొబైల్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినా.. ఎంతమందిని తనిఖీ కోసం నియమించినా, ఏ నియోజకవర్గంలోనూ డబ్బు పంపిణీ ఆగలేదు. ఎన్నిక ముందు అక్కడక్కడా అధికారులు కొద్దిగా హడావుడి చేసి రూ.లక్షో, రూ.50 వేలో తీసుకుని వెళ్లేవారిని కొంతమందిని పట్టుకున్నారు. ఆధారాలు చూపితే తర్వాత ఇచ్చారు. కొంత ఆధారాలు లేని సొమ్ము దొరికింది. చెక్‌పోస్టుల వద్ద కార్లు, ఇతర వాహనాలను తనిఖీ చేశారు. కార్లలో బ్యాగ్‌లు వాటిని చూసి వీడియో తీసి ఏమీ లేకపోతే వదిలేశారు. మోటారు సైకిళ్లను ఎక్కడా తనిఖీ చేయలేదు. రూ.లక్షల కొద్దీ సొమ్ము పోలీసు కళ్లుగప్పి ఆయా ప్రాంతాలకు చేరిపోయింది. నల్లజర్ల వద్ద ఒక వ్యాన్‌కు బోల్తా పడడం వల్ల ఏకంగా రూ.7 కోట్ల ఎన్నికల సొమ్ము బయటపడింది. అక్కడ యాక్సిడెంట్ జరగకపోతే..ఆ డబ్బు గురించి తెలిసేది కాదు. కమర్షియల్ ట్యాక్స్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేసినా వారు కేవలం జీఎస్‌టీ వరకే పరిమిత మయ్యారు. వారి లోపాల వల్ల కూడా సరుకు బాగా వచ్చేసింది. మద్యం ఏరులై పారింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు నామమాత్రంగా వ్యవహరించారు. అక్కడక్కడా కొద్దిగా పట్టుకుని చూపించారు. ప్రభుత్వ అధికారులు, లిక్కరు వ్యాపారులు కుమ్మక్కయి ఎన్నికలకు ముందే మద్యాన్ని తరలించారు. బార్లలో రేట్లు పెం చేశారు. అంతేకాదు సారా ఏరులైపారింది. ఇదంతా లెక్కలు వేస్తే ఒక్కో నియోజకవర్గానికి అందరు అభ్యర్థుల మొత్తం ఖర్చు కలిపి రూ.100 కోట్లు దాటేసింది.

చేయూత పడేదెప్పుడో!

- ఈబీసీ నేస్తం సంగతేంటో?
- సీఎం సార్ బటన్ నొక్కారు..వదిలేశారు
- ఐదు నెలలవుతున్నా అందని సొమ్ములు
- లబ్ధిదారుల ఎదురుచూపులు
- అధికారుల వద్ద కానరాని సమాచారం

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)



ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం పథకాలకు బటన్ నొక్కారు. అయితే నేటి వరకు ఒక్క ఆసరా సొమ్ములతోనే సరిపెట్టి మిగిలిన ఈబీసీనేస్తం, చేయూత పథకాలకు ప్రభుత్వం మొండిచేయి చూపడంతో లబ్ధిదారులు ప్రభుత్వ తీరుపై మండి పడుతున్నారు. ఎన్నికల కోడ్ వచ్చే ముందు సీఎం జగన్ మూడు పథకాలకు బటన్లు నొక్కడం తరువాత ప్రతి గ్రామంలోను ప్రజాప్రతినిధులు సమావేశాలు నిర్వహించి భారీ చెక్కులతో ఫొటోలు దిగడం మినహా ఇప్పటి వరకు పథకాల సొమ్ము పడిన దాఖలాలు లేవు. పోలింగ్ ముందు ఈసీ ఒక్క రోజు అవకాశం ఇచ్చినా ప్రభుత్వం మాత్రం లబ్ధిదారులకు సొమ్ములు చెల్లించడంలో విఫలమైంది. మూడు పథకాల్లోను ముఖ్యంగా ఈబీసీ నేస్తం,చేయూత పథకాలపై రాష్ట్రంలోని మహిళలు అనేక శలు పెట్టుకున్నారు.ఎట్టకేలకు డ్వాక్రా మహిళలకు ఆసరా కింద డబ్బు పడినట్టు చెబుతున్నారు. వాస్తవానికి జనవరి 23వ తేదీన అనంతపురం జిల్లాలో సీఎం జగన్ ఆసరా సొమ్ము జమ చేస్తున్నట్టు బటన్ నొక్కారు. సుమారు 4 నెలలైన తరువాత జిల్లాలో కొంత మంది డ్వాక్రా మహిళలకు గురువారం బ్యాంక్ అకౌంట్లలో డబ్బు జమచేశారు. జిల్లాలో 3,18,930 మంది డ్వాక్రా సభ్యులు ఉన్నారు. వారికి రూ.11.07 కోట్లు జమచేయవలసి ఉంది. అందులో కొందరికి పడినట్టు చెబుతున్నారు. ఈ మేరకు లెక్కలేవీ తమకు తెలియదని అధికారులు చెప్పడం గమనార్హం. అయితే సీఎం జగన్ మాత్రం బటన్ నొక్కి మీ ఖాతాల్లో డబ్బులు పడిపోయాయని చెబుతుంటారు. నాలుగో విడత వైఎస్ఆర్ చేయూత పథకం పంపిణీ కింద గతేడాది డిసెంబర్ 28న అనకాపల్లిలో సీఎం జగన్ బటన్ నొక్కారు. కానీ ఇప్పటికీ ఆ డబ్బు ఆయా ఖాతాల్లో జమకాలేదు. జిల్లాలో 85,311 మంది లబ్ధిదారులకు రూ.150.96 కోట్లు జమకావలసి ఉంది. ఐదు నెలలు దాటేసింది. ఎన్నికల కమిషన్ ఎన్నికలు పూర్తయ్యే వరకూ ఇవ్వొద్దని ఆదేశించిందని, ప్రతిపక్షాలు పంపిణీలను అడ్డుకున్నాయని వైసీపీ ప్రభుత్వం తెగబొంకిన సంగతి తెలిసిందే. ఇంకా ఈబీసీ నేస్తం కింద,కాపు,ఇతర కులాల మహిళలకు చేయూత సొమ్ము ఇంతవరకూ జమకాలేదు. ఐదేళ్లలో ఐదు సార్లు అందించాల్సిన పథకాలు కొన్ని మూడు విడతలు, కొన్ని నాలుగు విడతలతో సరిపెట్టడంతో ప్రభుత్వం నుంచి తామెంత లబ్ధిని కోల్పోయామనే లెక్కలు వేసుకుంటూ మహిళలు చర్చించుకుంటున్నారు.



తీపర్రులో అధికారులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్లు

అధికారులు వస్తున్నారని..

ఆపేశారా!

- రెండు నెలలుగా సాగుతున్న ఇసుక తవ్వకాలు
- అయినా పట్టించుకోని అధికారులు
- గురువారం తీపర్రు ర్యాంపులో హడావుడి
- అప్పటికే సర్దేసిన నిర్వాహకులు

పెరవలి, మే 16 : జిల్లాలో ఇసుక తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. జిల్లా అధికారులంతా ఉండే రాజమహేంద్రవరంలోనూ ఇదే పరి స్థితి. కడియం మండలం బుర్రిలంక ఇసుక ర్యాంపులో బుధవారం రాత్రి ఇసుక తవ్వకాలు జరిపారు.పెరవలి మండలం తీపర్రు ఇసుక ర్యాంప్ వద్ద ఇదే పరిస్థితి.గత రెండు మూడు నెలలుగా ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికారులకు కనపడలేదు. ఏవో అనుమతులు పేరుతో పరిమితులకు మించి లోతుగా తవ్వడం గోదావరికి అడ్డుగా బాటలు వేయడం జేసీబీలతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరపడం, పరి మితికి మించి తవ్వడం వంటి నిబంధనలు తుంగలో తొక్కి లారీలకు ఎటువంటి రశీదులు ఇవ్వకుండా తవ్వకాలు జరిగినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. అయితే ఏమైందో ఏమో కానీ కొంత మంది అధికారులు గురువారం ఉదయం తీపర్రు ఇసుక ర్యాంప్‌కు వచ్చారు. అక్కడి ర్యాంప్ తవ్వకం దారులకు ముందుగా సమాచారం అందిందో ఏమో కాని అధికారులు వచ్చేసరికి గోదావరిలో ఉండే ఎక్స్‌కవేటర్లు గట్టు మీదకు చేరుకున్నాయి. లారీలను కూడా ఏమి లేకుండా బయటకు తరలించారు. అక్కడ ఇంత వరకు ఉపయోగించిన పుస్తకాలు గాని ఏమి లేకుండా జాగ్రత్త పడ్డారు. అయితే అధికారులు సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చామని చెప్పడం విడ్డూరం. ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపినప్పటికీ అధికారులు ఇప్పటి వరకు కళ్ళకు గంతలు కట్టుకున్నారు. సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసినప్పటికీ అధికారులు కూడా తప్పుడు రిపోర్టుతో కోర్టును కూడా మోసగించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఎన్నికలు జరిగిన రాష్ట్ర ప్రభుత్వానికి పరిమిత అధికారాలు ఉండడంతో అధికారులు కూడా తమపై ఎటువంటి ఆరోపణలు వస్తాయోనన్న ఉద్దేశంతో ఇప్పుడిప్పుడే బయట పడుతున్నారు.అధికారులు వస్తున్నారని గురువారం ఆపివేసిన తవ్వకాలు శుక్రవారం కొనసాగుతాయా.. లేదా అనేది వేచి చూడాలి.

రెండు ఎక్స్‌కవేటర్లు.. రెండు లారీలు సీజ్..

తీపర్రు ఇసుక ర్యాంపులో మైనింగ్ అధికారులు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు నిర్వహించారు.మైనింగ్ ఏడీ సుబ్రహ్మణ్యంను కలిసి ఇక్కడకు రావడానికి గల కారణాలు ఇక్కడ తవ్వకాలపై ఏం చర్యలు తీసుకున్నారనే దానిపై విలేకరులు వివరణ కోరగా ఆయన వివరాలు చెప్పడానికి నిరాకరించారు. తాము ఉన్నతాధికారులకు మాత్రమే నివేదిక సమర్పిస్తామని మా స్థాయిలో ఎటువంటి సమాచారం చెప్పకూడదని దాట వేశారు. అయితే ఇక్కడ తవ్వకాలకు అనుమతి ఉందా లేదా అని అడగ్గా 2025 వరకు ప్రతిమ కంపెనీకి ఇసుక తవ్వకాలకు అనుమతి ఉందని తెలిపారు. అనుమతి ఉన్నపుడు ఇక్కడకు తనిఖీలకు ఎందుకు వచ్చారని ప్రశ్నించగా సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చామని బదులిచ్చారు. ఇక్కడ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా అని ప్రశ్నించగా మేము వచ్చే సమయానికి ఎటువంటి తవ్వకాలు జరగడం లేదని రెండు ఎక్స్‌కవేటర్లు,రెండు లారీలు మాత్రం ర్యాంప్ పైభాగంలో లంక భూమిలో ఉన్నాయని వాటిని సీజ్ చేశామని తెలిపారు. ఇక్కడ తవ్వకాలపై ఎవరైనా పిర్యాదు చేశారా అని ప్రశ్నించగా తమకు ఎటువంటి పిర్యాదు అందలేదని పేర్కొన్నారు. ఇక్కడ స్థానిక లారీ డ్రైవర్లు ఆయన వద్దకు వెళ్లి తమకు ఇసుక ఎగుమతి చేసినప్పటికీ తమకు ఎటువంటి రశీదులు ఇవ్వడం లేదని చెప్పగా దీనిపై తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు.ఆయనతో పాటు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.



కళ్లు మూసుకున్నారా?: రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో షెల్లార్ లేకుండా నిర్మించిన భవనం



చేతులు తడిపెయ్.. అక్రమంగా కట్టెయ్!

అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు

- భవన నిర్మాణానికో రేటు
- ప్రజాప్రతినిధి పేరు చెప్పి అజమాయిషీ
- వారు చెప్పిందే వేదం
- చోటా నాయకుల దోపిడీ
- కాదంటే రంగంలోకి ప్రజాప్రతినిధి
- నోర్మూసుకుంటున్న అధికారులు
- రాజమహేంద్రవరంలో ఇదీ తీరు

రాజమహేంద్రవరం సిటీ, మే 16 : ఇద్దరు ఐఏఎస్ అధికారులు ఉన్నారు.. ఒకరు జిల్లాకు అధికారి అయితే.. మరొకరు రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు అధికారి.. అయినా అక్రమార్కులకు అడ్డే లేదు.. అనుకున్న రీతిన.. నిబంధనలకు వ్యతిరేకంగా కట్టేస్తున్నారు.. అయినా అడిగే నాథుడే లేడు..ప్రశ్నించే అధికారీ లేడు.దీంతో జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిపోయింది. గతంలో ఏదైనా భవనం నిర్మించాలంటే దానికి అవసరమైన అనుమతులన్నీ ముందుగానే తీసుకుని అటుపై ఆ ప్లాన్లు, అనుమతుల ప్రకారం నిర్మాణాలు జరిగేవి. కానీ గత ఐదేళ్లుగా రాజమహేంద్రవరంలో అడ్డగోలు నిర్మాణాలు అధికమయ్యాయి. రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలెన్నో.. అయినా అటు వైపు కన్నెత్తి చూసేవారే లేరు.నిబంధనల ప్రకారం రాజమహేంద్రవరంలో భవనం నిర్మించాలంటే షెల్లార్లు తప్పనిసరిగా ఉండాలని కానీ నగరంలో షెల్లార్లు లేకుండానే బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జరిగిపోతున్నాయి. వాటిపై అధికారులు చర్యలు తీసుకునే పరిస్థితులు లేవు. ఎందుకంటే అధికార పార్టీ ప్రజాప్రతినిధి పేరు చెప్పడం కొన్నింటిని స్వయంగా ఆ ప్రజాప్రతినిధే సమర్థించడంతో అక్రమ కట్టడాలకు అజ్యం పోసినట్లయ్యింది. నిబంధనలకు విరుద్ధంగా చిన్నపాటి షెడ్లు,నిర్మాణాలు చేస్తే టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే వాటిని కూల్చివేస్తారు.. అలాంటిది యథేచ్ఛగానిర్మాణాలుసాగుతున్నా చోద్యం చూస్తున్నారు.

కమిషనర్ ఏం చేస్తున్నారు?

రాజమహేంద్రవరంలో అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను తొలగించేందుకు తొలుత వేగంగా చర్యలు తీసుకున్న కమిషనర్ దినేష్ కుమార్ ఇటువంటి ఘటనల పట్ల ఎందుకు స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆరు నెలల కిందట కొన్ని అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపించిన కమిషనర్ అటుపై వాటిని వదిలేశారు. కొన్ని భవనాలకు సంబంధించి నోటీసులు ఇచ్చారు. మరికొన్ని కోర్టులో ఉన్నాయి. కానీ షెల్లార్లులేకుండా కొత్తగా భవనాలు ఎలా నిర్మించారు. అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.అక్రమ భవనాలను అడ్డుపెట్టుకుని లక్షలు దండుకున్న ప్రజాప్రతినిధి వారి అనుచరుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమ నిర్మాణాలకు రేట్ ఫిక్స్

ప్రజాప్రతినిధి అనుచరులమంటూ కొందరు వ్యక్తులు పుట్టుకొచ్చి రాజమహేంద్రవరంలో అక్రమ నిర్మాణాలకు వారివారి వ్యక్తిగత ట్యాక్స్‌లు వేసేస్తున్నారు. దారుణంగా అక్రమాలకు రేట్లు ఫిక్స్ చేసేశారు. దీంతో రాజమహేంద్రవరంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధికి వారి మనుషులకు అక్రమ భవన నిర్మాణాలు కాసులు కురిపిస్తున్నాయి.ప్రజాప్రతినిధికి మెయిన్ రోడ్డులో ఇద్దరు అనుచరులు ఉన్నారు. ఆ ప్రాంతంలో నూతనంగా భవనాలు నిర్మించాలనుకుంటే ముందుగానే వారిని సంప్రదించి లక్షలాది రూపాయలు ప్యాకేజీ ఇచ్చుకుంటే వారు ఆయా భవనాలకు అడ్డగోలు అనుమతులిచ్చేస్తున్నారు.ఇందులో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి.. ఎవరైనా ప్రశ్నిస్తే సదరు అనుచరులు వారి నాయకుడితో ఫోన్లు చేయించడం చేస్తున్నారు. ఇలా మెయిన్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు సాగుతున్నాయి.అయితే కట్టడాలకు డబ్బులు చెల్లించని యజమానులు తమకు అడ్డులేదని భావించి వ్యాపారాలు చేసుకుంటున్నారు.కానీ వాస్తవానికి ఆయా భవనాలకు షెల్లార్లు లేకపోవడం కొన్ని ప్లాన్లకు విరుద్ధంగా ఉండడంతో ఎప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుంటే కూల్చివేత తప్పదనే భయాందోళనలో ఉన్నారు. కానీ ప్రజాప్రతినిధి అనుచరులు మాత్రం ఇప్పటికే లక్షలాది రూపాయలు దోచేయడంతో వారికేమి పోయేదిలేదని ధీమాలో ఉన్నారు.



విషం తింటున్నాం..

మార్చి నుంచే మార్కెట్లోకి..

కొన్నేళ్లుగా మామిడిపండ్లు మార్చి నుంచే మార్కెట్‌లోకి వస్తున్నాయి. పూర్తిగా పక్వానికి రాని పండ్లపై రసాయనలు చల్లి పండిస్తూ జిల్లాల్లో వివిధ మార్కెట్లలో పెద్ద మొత్తంలో అమ్మకాలు జరుపుతున్నారు. మామిడికాయలపై రసాయనాలు చల్లి అమ్మకాలు సాగిస్తున్నా అవి తినే వారు రోగాలు పాలవడంతో గతంలో రాష్ట్ర ప్రభుత్వం వీటిని కట్టడి చేసేందుకు దుకాణాలపై దాడులు చేశారు. రసాయనాలు చల్లి అమ్మకాలు సాగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గడంతో మామిడి పండ్లకు ఎనలేని డిమాండ్ ఏర్పడింది. మెట్టలో వీటి అమ్మకాలు ఆశాజనకంగా మారి జిల్లాలో ప్రధాన మార్కెట్‌లలో రసాయనాలతో పండించిన పండ్లు పెద్ద మొత్తంలో అమ్మకాలు చేస్తున్నా సంబంధిత అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంతో మామిడి పండ్ల ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా పండించిన పండ్లు కొనుగోలు చేసేందుకు సిద్ధపడిన దొరకని పరిస్థితి ఏర్పడిందని తెలుపుతున్నారు. రసాయనాలతో పండించిన పండ్లతో ప్రజారోగ్యానికి ముప్పు అని వివిధ రకాల క్యాన్సర్‌లకు రసాయనాలు కారణం అవుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఫలం విషతుల్యం..రసాయనాలతో పండిపోతున్న మామిడి.. పండ్లు ప్రమాదకరం అంటున్న వైద్య నిపుణులు

మార్కెట్లో ప్రస్తుతం లభ్యమవుతున్న మామిడిపండ్లు కళకళలాడుతున్నాయి. నిండైన పసుపు పచ్చని రంగులతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. అయితే మేడిపండు సామెతలా ఈ పండ్లు పైపైనే చూడముచ్చటగా ఉంటున్నాయి..లోపల మాత్రం ప్రమాదకర రసాయనాలు దాగి ఉన్నాయి..అప్రమత్తంగా ఉండకపోతే రోగాలే..

తుని రూరల్, మే 16: మామిడి పండ్ల సీజన్ వచ్చిందంటే చాలు ఆ పండ్లను ప్రజలు ఎగబడి కొనుగోలు చేస్తారు. మామిడి పండ్లలో తీపితో పాటు రుచిని ఇచ్చే పండ్లు బంగిన పల్లి, కొత్తపల్లి కొబ్బరి, చెరుకురసాలు.. ఉద్యానవన పంటలో 60 శాతం ఈ జాతికి చెందిన మామిడి తోటలు సాగు అవుతున్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతంలో మామిడి పండ్ల కొనుగోలు, దిగుబడి చేసేందుకు ఆసక్తి కనబరుస్తారు. ధర ఎంతైనా ఆలోచించకుండా కొనుగోలు చేస్తారు. కొనుగోలుదారుల నుంచి వచ్చే డిమాండ్లు చూసి మామిడి పండ్ల సీజన్‌కు నెల రోజుల ముందునుంచే వ్యాపారులు వాటిని అమ్మడం గమనార్హం. పండు దశకు వచ్చిన కాయను గడ్డిలో పెట్టి పండిస్తారు. అలా గడ్డిలో పెట్టిన కాయలు ఒకటి రెండు రోజుల్లో పండుతాయి. కొన్ని మూడు రోజులకు పండుతాయి. అలా రెండు మూడు రోజులు గడ్డి వేసి పండించని వ్యాపారులు రసాయనాలు వేసి ఒక్కరోజులోనే పండిస్తూ వాటిని ప్రజలకు అమ్మేస్తున్నారు. ఇలా రసాయనాలు వేసిన కాయలు మంచి పసుపు రంగు వచ్చి చూసేందుకు ఆకర్షణీయంగా ఉంటాయి. వీటిని చూసి కొనుగోలు చేసేందుకు ఎగబడతారు. ఎక్కువగా చైత్రమాసం మధ్య నుంచి మామిడి కాయలు మార్కెట్‌లో వస్తాయి. అవి కూడా గడ్డి వేసి పండించేవి ఉంటాయి.



తుని-విశాఖపట్నం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన దుకాణం

పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా

తీర్చిదిద్దుతా



నన్ను ఆదరించి అండగా నిలిచిన మీ ప్రేమ మరువలేనిది

కుటుంబ సభ్యుడిగా నన్ను గుండెల్లో పెట్టుకున్నారు..

నియోజకవర్గ ప్రజలకు పవన్‌కల్యాణ్ బహిరంగ లేఖ

పిఠాపురం, మే 16: రానున్న రోజుల్లో అందరిని కలుపుకుంటూ పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పవన్‌కల్యాణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు గురువారం బహిరంగలేఖ రాశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన తనను ఆదరించి అండగా నిలిచి మీరు చూపించిన ప్రేమ మరువలేనిదని, హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నాను అని ప్రకటించగానే స్వచ్ఛందంగా తరలివచ్చి కుటుంబ సభ్యుడిగా భావించి పనిచేయడం ఆనందం కలిగించిందని చెప్పారు. ఎన్నికల్లో రాత్రి 10 గంటల వరకూ పోలింగ్‌లో పాల్గొని రికార్డు స్థాయిలో 86.63 శాతం ఓటింగ్ నమోదు కావడం ప్రజల ప్రేమను తెలియజేస్తున్నదన్నారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జనసైనికులు, టీడీపీ, జనసేన కార్యకర్తలు వ్యవహరించిన తీరు అభినందనీయమన్నారు. సినిమాలు, ధారావాహికలకు విరామం ప్రకటించి పిఠాపురంలో ప్రతి గడపకు వెళ్లి ప్రచారం చేసిన సినీ, బుల్లి తెర నటీనటుల ప్రేమ తనను కదలించిందని పవన్‌కల్యాణ్ తెలిపారు. తన విజయాన్ని కాంక్షిస్తూ ఎంతో మంది అగ్ర కథానాయకులు నుంచి నవతరం నటుల వరకూ అందరు మద్దతు ప్రకటించడం ఆనందాన్ని ఇచ్చిందని చెప్పారు. దేశ, విదేశాలు నుంచి ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి తమ మాతృభూమి అభివృద్ధి ఆకాంక్షను వెల్లడించిన ఎన్నారై జన సైనికులకు అభినందనలు తెలియజేశారు.

బీఈడీ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు తదితరులు

దివాన్‌చెరువు, మే 16: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాల సహాయాచార్యులు ఎం.గోపాలకృష్ణ సహ రచయితగా రాసిన పుస్తకాన్ని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. ప్రభుత్వ తెలుగు, సంస్కృత అకాడమీలో బీఈడీ మొదటి సంవత్సరానికి చెందిన భౌతిక, రసాయన శాస్త్ర బోధనాభ్యసన శాస్త్రం-1 అనే పుస్తకాన్ని ఆవిష్కరించామని వీసీ తెలిపారు. పుస్తక రచనకు సహకరించిన విశ్వవిద్యాలయ అధికారులకు, అధ్యాపకులకు గోపాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

యువకుడిపై దాడి ఘటనలో ఇద్దరికి జైలు శిక్ష

పెద్దాపురం, మే 16: స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో ఆరు సంవత్సరాల కిందట ఓ యువకుడిపై జరిగిన దాడి ఘటనలో ఇద్దరు నిందితులకు స్థానిక ఏజేఎఫ్ఎం జడ్జి బుల్లెమ్మ 10 నెలలు జైలు శిక్షతో పాటు రూ. ఆరు వేలు జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే 2018 సంవత్సరంలో స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన దార్ల సాయిపై జగ్గంపేటకు చెందిన వజ్రాంగి సుమన్, ఆనూరు గ్రామానికి చెందిన ఇంటి వీర వెంకట సాయికిరణ్ నగదు విషయంపై గొడవ పడి దాడిచేశారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ ఏ.కృష్ణభగవాన్ కేసు నమోదు చేశారు. వాదోపవాదాలు పూర్తికావడం, నేరం రుజువు కావడంతో నిందితులు సుమన్, వీరవెంకట సాయికిరణ్‌కు 10 నెలలు సాధారణ జైలు శిక్షతో పాటు రూ.ఆరు వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున డి.నాగరాజు వాదించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలమేరకు డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వెంకటరమణ సాక్ష్యులను సకాలంలో కోర్టులో హాజరుపరిచారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొత్తపల్లి, మే 16: ఎద్దులు దెబ్బలాడుకొని వేగంగా ప్రయాణిస్తున్న బైక్‌పై పడడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తమూలపేట సెజ్ పునరావాస కాలనీలో గురువారం సాయంత్రం జరిగింది. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుని సమీపంలో అద్దరిపేటకు చెందిన ముత్తి దేముడు(19) తన స్నేహితునితో కలిసి గురువారం సాయంత్రం కాకినాడకు బీచ్‌రోడ్డులో బయలు దేరాడు. కొత్తపల్లి మండలం కొత్తమూలపేట వచ్చేసరికి రోడ్డుకు మధ్యలో పోట్లాడుతున్న ఎద్దులు వేగంగా ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టాయి. ఈ సంఘటనలో దేముడికి తీవ్ర గాయాలై కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రికి వెళ్లేలోగా దేముడు మృతి చెందాడని పోలీసులు తెలిపారు. దేముడు స్నేహితునికి తీవ్ర గాయాలవడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కొత్తపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుని కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- రేపటి నుంచి కల్యాణోత్సవాలు
- 19 రాత్రి దివ్యకల్యాణం
- రూ.50 లక్షలతో వేడుకలు
- కొండపై, కొండదిగువన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నూతన రథం
- మద్యం విక్రయాలపై ఆంక్షలు
- కల్యాణం వీక్షించేవారి సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు
- రత్నగిరి ఈవో రామచంద్రమోహన్



ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, మే 16: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడికి ఏడాదిలో అతి ముఖ్యమైన పర్వదినాలలో ప్రధానమైన సత్యదేవుడి వార్షిక కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ వెల్లడించారు. గురువారం సాయంత్రం ఆయన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఏర్పాట్లు వివరాలు వెల్లడించారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 18 నుంచి ప్రారంభమై 24 వరకు జరుగుతాయని 19 రాత్రి 9గంటలకు దివ్య కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు రూ 50 లక్షలు బడ్జెట్ కేటాయించామని చెప్పారు. ప్రధానంగా 19 రాత్రికి జరిగే దివ్య కల్యాణం రోజున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఈఏడాది కొండపైన, కొండదిగువన కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కల్యాణం వీక్షించేభక్తులకు వార్షిక కల్యాణవేదిక ఎదురుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నామని, భారీ వాహనాలను కొండపైకి అనుమతించడం లేదని కొండదిగువ నుంచి కొండపైకి 8 ప్రత్యేకబస్సుల ద్వారా ఉచిత రవాణా సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. దూరం నుంచి వీక్షించే భక్తుల కోసం 5 చోట్ల ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్లు, కల్యాణం అనంతరం భక్తులకు ఉచిత ప్రసాదం,, కల్యాణ అక్షింతల పంపిణీకి తూర్పు వైపు 5 కౌంటర్లు పశ్చిమ రాజగోపురం వైపు 3 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 10 వేల ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతామన్నారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్ ఇతర శాఖల సమన్వయంతో ఎటువంటి లోటుపాట్లు జరగకుండా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కల్యాణం ప్రత్యక్షంగా వీక్షించలేని భక్తుల కోసం వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం అందజేయనున్నట్లు చెప్పారు. 22వ తేదీన రథోత్సవం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని రూ.1.20 కోట్లతో తయారుచేసిన నూతన టేకు రథంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు జరుగుతుందన్నారు. కల్యాణోత్సవాల వారం రోజులు మద్యం విక్రయాలపై ఆంక్షలు విధిస్తూ సాయంత్రం 4 గంటలకే మెయిన్‌రోడ్డుపై మద్యం దుకాణాలను మూయించివేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది స్వామివారి శ్రీపుష్పయోగం స్వామివారి నూతన కల్యాణ మండపంలో నిర్వహిస్తామన్నారు. వారం రోజులు నిత్యకల్యాణం నిలుపుదల చేసి హోమాలు, రథసేవను తాత్కాలికంగా నిలుపుదల చేస్తామని తెలిపారు.

రథం ట్రయిల్ రన్ విజయవంతం



ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

సత్యదేవుడి సేవల కోసం రూ.1.20 కోట్లతో తయారుచేసిన పెద్ద టేకు రథానికి గురువారం నిర్వహించిన ట్రయిల్‌రన్ విజయవంతమైంది. స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవాలలో 5వ రోజైన 22వ తేదీన సాయంత్రం ఈ రథంపై స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించనుండడంతో ట్రయిల్ రన్ నిర్వహించారు. కొండదిగువ పంపా సత్రం వద్దనుండి తొలిపావంచా వద్ద వరకు నిర్వహించగా అడ్డుగా ఉన్న విద్యుత్, ఇతర వైర్లను తొలగించి రథం పైభాగంలో మరో 6 అడుగుల ఎత్తు వరకు ప్రత్యేక విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి పైకి కట్టారు. కొన్ని లోటు పాట్లు కనిపించాయని వాటిని సవరించనున్నట్లు ఈవో రామచంద్ర మోహన్ తెలిపారు.

సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా గురువారం మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. వేకువజామున రెండు గంటలకు స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింపచేశారు. మహన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. నూతన పట్టువస్త్రాలను ధరింపచేసి భక్తులను సర్వదర్శనాలకు అనుమతించారు. గురువారం మూలవరులు నిజరూప దర్శనంలో భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా ఆయుష్య హోమం నిర్వహించారు.

మొదటిరోజు ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్



పరీక్షల నిర్వహణా తీరును పరిశీలిస్తున్న వీసీ జీవీఆర్ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, మే16: ఏపీఈఏపీ సెట్-2024 ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష ఏపీ, హైదరాబాద్‌లోని 49 ప్రాంతీయ కేంద్రాల్లో మొదటిరోజు ప్రశాంతంగా జరిగినట్లు సెట్ ఛైర్మన్, వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షల నిర్వహణాతీరును వర్సిటీలోని ఈఏపీసెట్ కార్యాలయంలో కన్వీనర్ కె.వెంకటరెడ్డి, కోకన్వీనర్లు, కోఆర్డినేటర్లతో కలిసి గురువారం పరిశీలించారు. కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించి ఉదయం నిర్వహించిన పరీక్షకు 921మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 819మంది హాజరయ్యారని, 102మంది గైర్హాజరు కాగా 88.93 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ వెంకటరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 915మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 836మంది హాజరయ్యారని, 79మంది పరీక్ష రాయలేదని మొత్తం 91.37శాతం హాజరు నమోదైందన్నారు. మొత్తం రెండు సెషన్‌లకు కలిపి 1836మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1655మంది హాజరయ్యారని 181 మంది గైర్హాజరు కాగా మొత్తం 90.14 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. శుక్రవారం కూడా అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించిన పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షలు ఈ నెల 23 వరకూ కొనసాగుతాయని తెలిపారు.

సీలేరు కాంప్లెక్స్‌లో హైడల్ డైరెక్టర్

సుడిగాలి పర్యటన



పనులు పరిశీలించిన అధికారులు

మోతుగూడెం, మే16: ఏపీ జెన్‌కో జల విద్యుత్ కేంద్రం(హైడల్) డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ గురువారం సీలేరు కాంప్లెక్స్‌లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని రూ.530 కోట్ల వ్యయంతో జరుగుతున్న పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలోని రెండో దశ నిర్మాణ పనులను స్థానిక జెన్‌కో అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా 5,6 యూనిట్లకు నీటిని సరఫరా చేసే పెన్‌స్టాక్ పైప్‌లైన్ ఎరక్షన్ పనులను పరిశీలించారు. అనంతరం జల విద్యుత్ కేంద్రంలోని 5,6 యూనిట్లను అమర్చేందుకు డిజైన్ చేసిన సివిల్ పనులు కూడా పరిశీలించారు. అలాగే జల విద్యుత్ కేంద్రంలోని నాలుగు యూనిట్ల పని తీరుపై ఆరా తీశారు. యూనిట్లకు సాంకేతిక లోపాలు తలెత్తకుండా విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని, గ్రిడ్ అధికారులు ఆదేశాల మేరకు ఆదేశాలు జారీ చేసిన వెంటనే యూనిట్ వినియోగంలోకి వచ్చేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీలేరు కాంప్లెక్సు పరిధిలో అన్ని జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి వివరాలపై స్థానిక సీఐ బి.శ్రీనాథ్‌ను ఆరా తీశారు. అలాగే సీలేరు కాంప్లెక్సు నీటిని సరఫరా చేసే బలిమెల జలాశయంలో నీటి నిల్వలు ఎంత ఉన్నాయి, సీలేరు, డొంకరాయి జలాశయాల్లో ఎన్ని టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫోర్‌బై, డొంకరాయి పవర్ కెనాల్‌లను డొంకరాయి సీలేరు జల విద్యుత్ కేంద్రాలను హైడల్ డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్, సూపరింటెండెంట్ కేకేవీ ప్రశాంత్‌కుమార్, ఈఈ విజయ్‌కుమార్, మోతుగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఏఈ పవన్‌విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వరదలను సమర్థవంతంగా ఎదుర్కొందాం

ధవళేశ్వరం, మే 16: రానున్న వరదల సీజన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొందామని గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్‌కుమార్ అన్నారు. గురువారం ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ జి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్లడ్‌బ్యాంక్స్ పటిష్టమైన నేపథ్యంలో బలహీనంగా ఉన్న గట్లను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్ల ఔట్‌ఫాల్ స్లూయిజ్ షెట్టర్‌లు రిపేర్లు చేసి పటిష్ట పరచాలన్నారు. వరదలను ఎదుర్కోవడానికి ఫడ్ స్టోర్స్‌లో ఫ్లడ్ మెటీరియల్ సిద్ధం చేయడానికి ఏర్పాట్లు చేయాలని ఎస్ఈకి సూచించారు. సమావేశంలో హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, తూర్పుడెల్టా ఈఈ వీవీ రామకృష్ణ, సెంట్రల్ డెల్టా ఈఈ శ్రీనివాస్, డ్రైనేజ్ డివిజన్ ఈఈ సుబ్బయ్య, వైఎస్సీ డివిజన్ ఈఈ విజయభాస్కర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.90.45 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం, మే 16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి హుండీ కానుకలు లెక్కింపు నిర్వహించారు. పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, పీవీవీఎస్ కామేశ్వరరావు, బి.కిరణ్ పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. 31 రోజులకుగాను ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.67,40,864, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.23,04,541 మొత్తం రూ.90,45,405 ఆదాయం లభించింది. బంగారం 14 గ్రాములు, వెండి 710 గ్రాములు, వివిధ దేశాల కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ డీసీ, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. అలాగే క్షేత్రపాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీ ఆదాయం 2,30,472 ఆదాయం లభించింది. ఈ లెక్కింపులో బ్యాంకు సిబ్బంది, పోలీసులు, దేవస్థాన సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



తాబేళ్లు స్వాధీనం

రంపచోడవరం, మే 16: తాబేళ్ల అక్రమ రవాణా కేసులో ఫోక్సుపేట రేంజ్ అటవీ శాఖాధికారులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. రేంజ్ అధికారి కరుణాకర్ ఆధ్వర్యంలో ఫోక్సుపేట అటవీశాఖ తనిఖీ కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కోనసీమ జిల్లా రామచంద్రాపురం నుంచి మినీ వ్యాన్‌లో ఒడిసాకు గన్ని బ్యాగ్‌లలో తరలిస్తున్న 1589 తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. బతికి ఉన్న తాబేళ్లను అటవీ ప్రాంతంలో నీరు ఉన్న ప్రదేశాలలో వదిలిపెట్టనున్నట్లు రేంజ్ అధికారి తెలిపారు.

నేటి నుంచి భావనారాయణస్వామి దివ్య కల్యాణోత్సవాలు

24 వరకు వివిధ కార్యక్రమాలు

సర్పవరం జంక్షన్, మే 16 : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి సప్తాహ్నిక దివ్య కల్యాణోత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి కల్యాణోత్సవాలు శుక్రవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు, ఆలయ ఛైర్మన్ పుల్ల నారాయణరావు తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఈనెల 17న స్వామివారికి సుప్రభాత సేవ, అర్చనలు, హోమం, ప్రత్యేక పూజలను ఆలయ పండితులు నిర్వహిస్తారన్నారు. స్వామివారిని పలు రకాల పుష్పాలతో అలంకరించిన అనంతరం సింహ వాహనంపై పల్లకీలో స్వామివారిని ఉంచి భక్తుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 19న స్వామివారి దివ్య కల్యాణం వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహిస్తామన్నారు. 23న స్వామివారిని సూర్యారావుపేట బీచ్‌కు తీసుకెళ్లి చక్రస్నానం చేయిస్తామని తెలిపారు. 24న శ్రీపుష్ప యాగోత్సవంతో స్వామివారి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ప్రతీ రోజు స్వామివారిని పలు రకాల పుష్పాలతో అలంకరించి, సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు, పలు రకాల విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం వేళ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు కల్యాణంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

నేడు కూటమి ఆత్మీయ సమావేశం

నల్లజర్ల, మే 16: మండలంలోని అనంతపల్లి ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగే కూటమి ఆత్మీయ సమావేశానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఈ ఎన్నికల్లో కష్టపడిన ప్రతి కార్యకర్త, నాయకుడు ఈ సమావేశానికి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఏజెన్సీ సమాచారం



అధ్వానంగా డొంకరాయి-సీలేరు రహదారి

రహదారి గోతులమయం

మోతుగూడెం, మే 16: వై.రామవరం మండలం బొడ్డగడి పంచాయతీ డొంకరాయి నుంచి సీలేరు రహదారి ప్రమాదకరంగా తయారయింది. కల్వర్టులు వద్ద గోతులు రూపంలో ముప్పు పొంచి ఉంది. రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గోతులు పడటంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మంగంపాడు ప్రాథమిక ఆసుపత్రిలో ఏమైనా ఎమర్జెన్సీ కేసు వచ్చిందంటే మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్ చింతూరు గవర్నమెంట్‌కు, రంపచోడవరం హాస్పటల్‌కి గాని వెళ్లాలంటే చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారి మరమ్మత్తులు చేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

చిన్నపిల్లల యూనిట్ పరిశీలన



చిన్న పిల్లల యూనిట్‌ను పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్

కూనవరం, మే 16: మండలంలోని కోతులగుట్ట ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్న పిల్లల యూనిట్ (ఎస్.ఎన్.సీయూ)ను గురువారం వైద్య ఆరోగ్యశాఖ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఎన్‌సీయూలో ఉన్న 30 రోజుల చిన్న పిల్లలకు అందుతున్న వైద్య సేవలను అక్కడి వైద్యాధికారులను, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఈ యూనిట్‌లో చిన్న పిల్లలకు అందిస్తున్న మందులను పరిశీలించారు. చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పి.పుల్లయ్య, కూనవరం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.మహేష్‌బాబు, ఎస్ఎన్‌సీయూ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుభాష్, చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ టీవీ శేషిరెడ్డి, హెడ్‌నర్స్ బి.బొజ్జి, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూ నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీలో పాల్గొన్న ఆసుపత్రి అధికారులు, సిబ్బంది

రంపచోడవరం, మే 16: డెంగ్యూ నిర్మూలనకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మి అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినం సందర్భంగా ఏరియా ఆసుపత్రి నుంచి బోర్నగూడెం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూను నివారిద్దాం అనే నినాదంతో ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎన్.వాసు, ల్యాబ్ టెక్నీషియన్ బి.నాగభూషణం, వీరకుమారి, వైద్యాధికారిణి డిసోజ, హారిక, ఇందిర, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం, మే 16: 2024-25 విద్యా సంవత్సరానికి గాను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూప్స్ ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యు(ఎఫ్)లలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీవీవీ దుర్గాప్రసాద్ తెలిపారు. పదో తరగతి చదివిన గిరిజన విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం కళాశాలను సంప్రదించాలని సూచించారు.

చెరువు పనులకు రూ.20 వేల వితరణ



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

కూనవరం, మే16: మండలంలోని చినఆర్కూర్ గ్రామ పంచాయతీలో జిన్నెల గూడెం చెరువు తూము మరమ్మతులు నిమిత్తం జమైల్‌ఖాన్ ట్రస్టు ద్వారా డాక్టర్ జమైల్‌ఖాన్ రూ.20 వేలు అందజేశారు. స్థానిక టీడీపీ నాయకులు సూచనలు మేరకు ఆయన ఈ సాయం అందించారు. స్థానిక గిరిజనులు, ఆపదలో ఉన్న వారికి జమైల్‌ఖాన్ ట్రస్టు ద్వారా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంట్ ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు, పొడియం అప్పారావు, గడేసుల ప్రేమ్ చంద్, ఎస్‌కె రసూల్ పాల్గొన్నారు.

ఘనంగా మంచాలమ్మ జాతర



ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కూనవరం, మే16: మండలంలో పెదఆర్కూర్ గ్రామంలో మంచాలమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈ జాతరను గిరిజనులు ఆర్భాటంగా నిర్వహిస్తారు. పక్క రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్ మధ్యప్రదేశ్, ఒడిసా రాష్ట్రాల నుంచి గిరిజనులు వచ్చి ఈ జాతరలో పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా ఈ జాతర జరుగుతుంది.

ఓటెత్తిన పల్లె

- పెరవలిలో 86శాతం పోలింగ్ నమోదు
- ఓటింగ్‌లో పాల్గొన్న 49,653 మంది ఓటర్లు
- 2019 ఎన్నికల కంటే సుమారు 3శాతం అధికం



తీపర్రులో ఓటేసేందుకు లైన్‌లో నిలబడిన మహిళలు(ఫైల్)

పెరవలి, మే 16: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈ నెల 13న జరిగిన పోలింగ్ మండలంలోని ఆయా గ్రామాల్లో అధికశాతం పోలింగ్ నమోదైంది. కొన్నిచోట్ల నిర్దేశిత సమయం దాటి పోలింగ్ జరిగింది. ఇదిలా ఉండగా 2019లో జరిగిన ఎన్నికల్లో 82.7శాతం పోలింగ్ నమోదు కాగా ఈ సారి 86శాతం పోలింగ్ నమోదైంది. కొన్ని బూత్‌లలో 90శాతం మించి ఓటింగ్ జరిగింది. మండలంలో అత్యధికంగా వెంకట్రాయపురంలో 93శాతం పోలింగ్ నమోదు కాగా, తక్కువగా పెరవలి, ఖండవల్లిలో 80శాతం మాత్రమే నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు. మండలంలో 18 గ్రామాల్లో 56 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం ఓటర్లు 57,709 కాగా, దీనిలో పురుషులు 28,563, మహిళలు 29,146 ఉండగా మొత్తం 49,653 ఓట్లు పోలయ్యాయి. దీనిలో మహిళలు ఓట్లే ఎక్కువగా పోలైనట్టు చెబుతున్నారు. గ్రామాల వారీగా పోలైన ఓట్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నడిపల్లి 87శాతం, కానూరు 86శాతం, కానూరు అగ్రహారం 87శాతం, ఉసులుమర్రు 88శాతం, తీపర్రు 90శాతం, కాకరపర్రు 85శాతం, వెంకట్రాయపురం 93శాతం, అజ్జరం 87శాతం, పెరవలి 82శాతం, ముక్కామల 87శాతం, కాపవరం 88శాతం, కొత్తపల్లి 86శాతం, నల్లాకులవారిపాలెం 88 శాతం, ఖండవల్లి 82శాతం, మల్లేశ్వరం 89శాతం, అన్నవరప్పాడు 89శాతం, పిట్లవేమవరం 89శాతం, కడింపాడు 81శాతం పోలైనట్టు అధికారులు తెలిపారు. అయితే కొన్ని పోలింగ్ బూత్‌లలో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండడంతో సకాలంలో ఓట్లు వేయలేని కొంతమంది ఓటు వేయకుండానే ఇళ్లకు వెళ్లి పోయారని, లేదంటే పోలింగ్ శాతం మరింత పెరిగేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



అనపర్తి: రామవరంలో ఓటు వేసేందుకు లైన్‌లో వేచి ఉన్న ఓటర్లు(ఫైల్)

ఓటింగ్‌లో రంగంపేట టాప్

అనపర్తి లీస్ట్.. జిల్లాలో నియోజకవర్గానికి మూడో స్థానం

అనపర్తి, మే 16: ఈనెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో 86.23శాతం ఓటింగ్‌తో జిల్లాలో మూడో స్థానంలో నిలిచింది. కాగా నియోజకవర్గ పరిధిలో రంగంపేట మండలం 88.88శాతం పోలింగ్‌తో మొదటి స్థానంలో నిలవగా అనపర్తి మండలం 85.43శాతం చివరి స్థానంలో నిలిచింది. నియోజకవర్గంలో మొత్తం 2,26,053మంది ఓటర్లు ఉండగా 1,94,924మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 96,161 కాగా మహిళలు 98761 మంది, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనపర్తి మండలంలో 59,886మంది ఓటర్లకు గాను 51148మంది ఓటు హక్కును వినియోగించుకోగా 85.43శాతం నమోదైంది. బిక్కవోలు మండలంలో 57,684మంది ఓటర్లకు గాను 49,413మంది ఓటు హక్కును వినియోగించుకోగా 85.66శాతం నమోదైంది. పెదపూడి మండలంలో 60,265మంది ఓటర్లకు గాను 51,539 మంది ఓటింగ్‌లో పాల్గొనగా 85.52శాతం నమోదైంది. రంగంపేట మండ లంలో 48,180మంది ఓటర్లు ఉండగా 42,824 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 88.88శాతం నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే నియోజకవర్గ పరిధిలో సుమారు పదివేల మంది ఓటర్లు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

డెంగీని నివారిద్దాం

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 16: ప్రజలతో చేయి చేయి కలుపుదామని, డెంగ్యూ వ్యాధిని నివారిద్దామని, సమర్థవంతమైన సమాజ భాగస్వామ్యంతో వ్యాధిని తరిమికొడదామని అవగాహన కల్పించడంలో మనమంతా ముందుండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. జాతీయ డెంగ్యూ నివారణా దినం సందర్భంగా గురువారం స్థానిక వై-జంక్షన్ వద్ద ఉన్న కంబాలపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. దీనికి డీఎంఅండ్‌హెచ్‌వో ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్, డాక్టర్ లావణ్య, బి.రాజు, కె.బాపిరాజు, డీడీ భవాని, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం సమావేశంలో పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్‌వో



కొవ్వూరులో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు: కొవ్వూరు క్రిస్టియన్‌పేట యూహెచ్‌సీలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ నివారణా దినాన్ని నిర్వహించారు. విలేజ్ హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లకు డెంగ్యూ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ డ్రై డే ఫ్రై డే ఆవశ్యకత, డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో ఏ విధంగా అవగాహన కలిగించాలో, యాంటీ లార్వల్ ఆపరేషన్ చేపట్టే విధానాలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని కె.సావరంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడారు. ప్రజల సహకారంతో డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చని వైద్య సిబ్బందికి సూచించారు. దోమలు వల్ల వచ్చే ఈ వ్యాధితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమతెరలు వాడాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు పెరుగుతాయని, వర్షాకాలంలో ఇంటి ఆవరణ చుట్టు నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది జి.శ్రీనివాసరావు, రత్నకుమారి, సంధ్యాలక్ష్మి, విజయ్, చిరంజీవి, రాము, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

కుతుకులూరులో దారుణ హత్య

వృద్ధుడి ప్రాణాన్ని బలిగొన్న నోటి దురుసు



సూర్యనారాయణరెడ్డి మృతదేహం

అనపర్తి, మే 16: అనపర్తి మండలం కుతుకులూరులో గురువారం రాత్రి గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు హత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పులగం సూర్యనారాయణరెడ్డి(60) వ్యవసాయ పనులు చేయడం, పశువులకు గడ్డి కోయడం వంటి పనులు చేస్తుంటాడు. అయితే సూర్యనారాయణరెడ్డి మద్యం తాగినప్పుడు అకారణంగా అందరిపైనా నోరు పారేసుకుంటూ ఉంటాడు. ఈ క్రమంలో గురువారం గ్రామానికి చెందిన తాపీమేస్త్రి తాడి శివారెడ్డి భార్యతో కలిసి వెళుతుండగా ఆమెపై నోరు పారేసుకున్నాడు. దీంతో శివారెడ్డి అతనిపై కక్ష పెంచుకుని రాత్రి 9గంటల ప్రాంతంలో అతను ఉండే పశువుల పాక వద్దకు వెళ్లి అక్కడే ఉన్న పశువులను కట్టే కర్రాడుతో మెడపై కొట్టడంతో సూర్యనారాయణరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ శివగణేష్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి స్థానికుల నుంచి సమాచారం సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

19న రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 16: జిల్లా చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యిలోని ది ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్లో రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 17వ తేదీ లోపు www.apchess.org ద్వారా నమోదు చేసుకోవాలని చెప్పారు. క్రీడాకారులకు భోజన వసతి సదుపాయం కల్పించనున్నట్టు ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వై.కళ్యాణ్‌కుమార్ చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్.62812 50967ను సంప్రదించాలని కోరారు.

రంగంపేటలో వేసవి శిక్షణా తరగతులు



రంగంపేటలో సరస్వతీదేవి చిత్రపటానికి నమస్కరిస్తున్న దృశ్యం

రంగంపేట, మే 16: వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తి వెలికి తీయవచ్చునని రంగంపేట గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన స్థానిక గ్రంథాలయంలో ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు వజ్రపు వెంకటరమణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం బాలల పుస్తకాలతో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు జూన్ 7వ తేదీ వరకు నిర్వహిస్తామని, శిబిరంలో నీతి కథలు చెప్పడం, తెలుగు వ్యాకరణం, స్పోకెన్ ఇంగ్లీషు, పేపర్‌క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లో భౌ..బోయ్

- రైల్వే స్టేషన్‌లో కుక్కల స్వైర విహారం
- బెంబేలెత్తిపోతున్న ప్రయాణికులు
- పట్టించుకోని రైల్వే అధికారులు




రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో పడుకున్న కుక్కలు



రాజమహేంద్రవరం, మే 16(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌జీ-2 హోదా కలిగిన రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషన్‌ని కుక్కల బెడద వీడడం లేదు. ఈ స్టేషను గుండా రోజుకు సుమారు 10వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగి స్తారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయితే, శునకాలు మాత్రం రోజంతా స్వైర విహారం చేస్తుంటాయి. అలసట పడిన ప్పుడు ప్లాట్‌ఫాంలపై ఎక్కడపడితే అక్కడ నిద్రకు ఉపక్రమిస్తున్నాయి. ప్రయాణికుల వెయిటింగ్ హాల్స్‌లో కూడా ఇవి దర్శనమిస్తున్నాయి. మొదటి ప్లాట్‌ఫాంపై శునకాల బెడద ఎక్కువగా ఉంది. రైలు ఎక్కే హడావుడిలో కాలు, లగేజీ వాటికి తగిలితే ప్రయాణికులను కరవడానికి మీదకు వస్తున్నాయి. వ్యాధులు సోకిన కుక్కలు కూడా ఉండడంతో కరిస్తే కచ్చితంగా ప్రాణాలు పోతాయంటూ ప్రయాణికులు బెంబేలెత్తిపోతు న్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు హడలిపోతున్నారు. ఎండల తీవ్రత ఎక్కువ అవుతుండడంతో సాధారణంగా కుక్కలు కాస్త తీవ్ర స్వభావం చూపిస్తుంటాయి. దీంతో రైలు ప్లాట్‌పాంకు వచ్చే సమయంలో కుక్కలకు భయపడి ఏ మాత్రం పట్టుతప్పినా ప్రయాణికులు పట్టాలపై పడిపోయే ప్రమాదం పొంచివున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఏదైనా ప్రమాదం జరిగితే గానీ మేలుకోరా? అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. కుక్కలు ప్లాట్‌ఫాంలపై తిరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమిస్తే గానీ ఫలితం కానరాని పరిస్థితి ఉంది.

ఫ్లాట్‌ఫాంపై నిద్రపోతున్న కుక్క



రైల్వే స్టేషన్లో ప్రయాణికుడి వద్ద కాపు కాసుకుని ఉన్న కుక్క



ఫ్లాట్‌ఫాం నుంచి బయటకు వెళ్లే దారికి అడ్డంగా పడుకున్న కుక్కలు

వాసవీమాతకు విశేష పూజలు

ధవళేశ్వరం, మే 16: వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. యువ వైశ్య ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సీతానగరం, మే 16: మండలంలోని చినకొండేపూడి సబ్‌స్టేషన్ నుంచి 33/11 కేవీ లైన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 17, 18 తేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. దీంతో చినకొండేపూడి, సీతానగతరం నాగరత్నం కాలనీలకు ఉదయం 7గంటల నుంచి 1గం. వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

తాళ్లపూడిలో వేసవి విజ్ఞాన శిబిరం

తాళ్లపూడి, మే 16: తాళ్లపూడిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేసినట్టు గ్రంథాలయాధికారి నరేష్ తెలిపారు. జూన్ 7వ తేదీ జరిగే ఈ శిబిరాన్ని విశ్రాంత ఉపాధ్యాయుడు జి.సూర్యనారాయణ, కొందరు చదువరుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ గ్రామర్ రాయించడం, చదివించడం, మాట్లాడించడం నేర్పిస్తారని, ప్రతిరోజూ కార్యక్రమంలో పోటీలు జరుగుతాయని, చివరి రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని గ్రంథాలయానికి పంపించాలని కోరారు.

రేపటి నుంచి బ్యాడ్మింటన్‌లో ఉచిత శిక్షణ

కొవ్వూరు, మే 16: కొవ్వూరు బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో అవంతీ ఫౌండేషన్ సహకారంతో ఉచిత వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్టు అకాడమీ కార్యదర్శి పొట్రు మురళీ తెలిపారు. స్థానిక సత్యవతినగర్‌లోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి జూన్ 18వ తేదీ వరకు ఈ శిబిరం నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు సీనియర్ కోచ్‌లు కెనడి, కె.సతీష్ శిక్షణ అందిస్తారన్నారు.

కూటమిదే విజయం

● నాయకులు, కార్యకర్తల కృషి మరువలేనిది ● టీడీపీ నాయకుడు అచ్చిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న పెండ్యాల అచ్చిబాబు

కొవ్వూరు, మే 13: ఈ ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని, ఎన్నికల కార్యక్రమాల్లో అహర్నిశలు పనిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల కృషి మరువలేనిదని టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు) అన్నారు. కొవ్వూరులోని యువరాజ్ కళ్యాణ మండపంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో గురువారం కూటమి నియోజకవర్గ ఆత్మీయ ధన్యవాద సభ నిర్వహించారు. అచ్చిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఈ ఎన్నికలు ధ్రువీకరించాయన్నారు. కూటమి అభ్యర్థులైన ముప్పిడి వెంకటేశ్వరరావు, దగ్గుబాటి పురందేశ్వరి గెలుపునకు మూడు పార్టీల కార్యకర్తలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న యువత కష్టపడి పనిచేశారన్నారు. నియోజకవర్గ పరిశీలకులు గొర్రెల శ్రీధర్ మాట్లాడుతూ అభ్యర్థి ఎంపిక నుంచి పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు సైకో పాలనను తరిమికొట్టడానికి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎనలేని కృషి చేశారని, అభ్యర్థులకు అత్యధిక మెజార్టీ ఖాయమన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జనసేన, బీజేపీ కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో చాలా కృషిచేశారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా, కేంద్రంలో మోదీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఈ సందర్భంగా అచ్చిబాబు, ముప్పిడి వెంకటేశ్వరరావులను సత్కరించి, బుద్ధుడి ప్రతిమను బహూకరించారు. కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	ఆ ఒక్కటీ అడక్కు
సూర్యామినీ	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
సూర్యాప్యాలస్	అపరిచితుడు
స్వామి	కృష్ణమ్మ
శివజ్యోతి	గీతాంజలి మళ్లీ వచ్చింది
అనుశ్రీ(సాయికృష్ణ)	ది గ్యారీ ఫీల్డ్ మూవీ
రాజా	రత్నం
ఊర్వశి	బాక్
రంభ	మిరల్
మేనక	నటరత్నాలు, ప్రసన్నవదనం
అప్సర	కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
కుమారి	దర్శిని, రత్నం
వీఎస్ మహల్(నామవరం)	కృష్ణమ్మ
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	అపరిచితుడు
వెంకటసూర్య(కడియం)	ఆ ఒక్కటీ అడక్కు
సత్యగౌరి (అనపర్తి)	బాక్
సూర్యశ్రీ (అనపర్తి)	ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	బాక్
రామకృష్ణ(కోరుకొండ)	
గీతాసినిమాస్ (సీతానగరం)	
శ్రీనివాస (గోకవరం)	కృష్ణమ్మ
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
లలితామహల్(రంపచోడవరం)	ఆ ఒక్కటీ అడక్కు
నవయుగ(చింతూరు)	ఆ ఒక్కటీ అడక్కు

ఓటెత్తిన పల్లె
గ్రామాల్లో భారీగా సాగిన పోలింగ్ 8
వరదలను సమర్థంగా ఎదుర్కొందాం
గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీర్ సతీష్‌కుమార్



భద్రత ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ మాధవీలత
సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఈవీఎంలకు మూడంచెల భద్రత

- నన్నయలో కట్టుదిట్టంగా భద్రత ఏర్పాట్లు..
- నిరంతర సీసీ కెమెరాల పర్యవేక్షణ
- ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్, ఎస్పీ

రాజానగరం, మే 16 : ఆదికవి నన్నయ వర్శిటీలోని స్ట్రాంగ్ రూమ్ వద్ద 24/7 మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని.. కేంద్ర బలగాలు పహరా కాస్తున్నాయని జిల్లా ఎన్నికల అధికారి డా.కె.మాధవీలత తెలిపారు. ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి గురువారం సాయంత్రం ఆమె ఇక్కడ ఏర్పాట్లు పరిశీలించారు.ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు నన్నయ వర్శిటీలో భద్రపరచిన సంగతి విధితమే. ఈ మేరకు భద్రత ఏర్పా జూన్ 4న జరిగే కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. కేంద్ర ఆర్మ్‌డ్, పోలీసు ఫోర్స్, మొబైల్ టీమ్ ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమేరా పర్యవేక్షణ కట్టుదిట్టంగా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఏడు అసెంబ్లీ, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి బ్యాలెట్, కంట్రోలు యూనిట్స్, వీవీ ప్యాట్స్ పకడ్బందీగా భద్రపరిచామన్నారు. కౌంటిం గ్‌కు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఏర్పాట్లు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడు షిఫ్టలలో బందోబస్తు, గెజిటెడ్ అధికారుల పర్యవేక్షణ ఉందన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా పెట్టామన్నారు.స్ట్రాంగ్ రూమ్‌లలో ఎటువంటి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా ఉండడంకోసం విద్యుత్ సరఫరా నిలిపివేయాలని ఆదేశించారు. ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ నన్నయ వర్శిటీ వద్ద డీఎస్పీ, సీఐ, మొబైల్ టీమ్, సీఆర్పీఎఫ్, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు, రాష్ట్ర పోలీసుల ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు.కౌంటింగ్ ముగిసే వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.సమావేశంలో రిటర్నింగ్ అధికారులు ఎస్.తేజ్‌భ రత్, కె.దినేష్‌కుమార్,అశుతోష్‌మిశ్రా,ఎ.చైత్రవర్షిణి, ఎం.మాధురి,రమణ నాయక్,కెఎల్ శివజ్యోతి, అదనపు ఎస్పీలు ఎల్.చెంచిరెడ్డి, కృష్ణనాయక్ పాల్గొన్నారు.

రూ.40 కోట్లు!

ఇదీ ఒక్కో అభ్యర్థి ఖర్చు

- మారిన ఎన్నికల రాజకీయం
- ఆర్థిక బలం ఉన్న వారే అభ్యర్థులు
- నోటుకు పడిపోయిన ఓటు
- నియోజకవర్గం ఖర్చు రూ.100 కోట్లు
- రిజర్వు స్థానాల్లోనూ మారిన సీన్





(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజకీయాలు పూర్తిగా వ్యాపారం అయ్యాయి. ఎన్నికలు మరీ ఖరీదయ్యాయి. ప్రజాస్వామ్యంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలే కాదు. ఓ మోస్తరు కోటీశ్వరులు ఎన్నికలను ఎదుర్కోలేని పరిస్థితి. రాజకీయ పార్టీలు టికెట్లు ఇచ్చే సమయంలో కూడా అభ్యర్థి ఆర్థిక పరిస్థితిని ప్రామాణికంగా తీసుకుంటున్నారు. రిజర్వు స్థానాల్లోనూ ఎంతో కొంత ఆర్థికంగా బలీయులైనవారికే సీట్లు దక్కే అవకాశం ఉంది.ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ఒక్కో అభ్యర్థి రూ.25 కోట్ల నుంచిరూ.40 కోట్ల వరకూ ఖర్చు చేసినట్టు ప్రచారం జరుగుతోంది.

ఖర్చు జరిగిందిలా..

ఎన్నికల కమిషన్ ఎన్ని ఆంక్షలు పెట్టినా.. ఎంత నిఘా పెట్టినా.. ఖర్చు లేకుండా ఎన్నికలు జరగడం లేదు. పైగా ఈసారి షెడ్యూల్ మార్చి 16వ తేదీన వచ్చింది.నోటిఫికేషన్ ఏప్రిల్ 18వ తేదీన జారీ అయింది. గడువు ఎక్కువగా ఉండడంతో క్యాడర్‌ను వెనుకతిప్పుకోవడానికే ఖర్చు ఎక్కువైంది. దీంతో అభ్యర్థికి మొదటి నుంచీ ఖర్చు తప్పలేదు. వార్డు ఇన్‌చార్జిలు, ముఖ్యులకు ముందుగా కనీసం రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ముట్టచెప్పాలి. గ్రామాల్లో నేతలకు, ముఖ్య క్యాడర్‌కు ఎంతో కొంత ఇవ్వాలి. అభ్యర్థుల తుది జాబితా వచ్చిన తర్వాత ప్రతి రోజూ ప్రతి ఊళ్లోనూ ప్రచారాలు ఉంటాయి. వీటికి చాలా ఖర్చవుతుంది. ప్రచారం నుంచి నామినేషన్ దాఖలు చేసే వరకూ ప్రతిరోజూ కనీసం 25 మందికి తగ్గకుండా మనిషికి రూ.500 వంతున ఇచ్చి జనాన్ని తీసుకొచ్చారు. నామినేషన్ రోజున ఈ సంఖ్య మరింత పెరిగింది. ఇక పోలింగ్ రోజుకు రెండు రోజుల ముందు నుంచే ఓటర్లకు పంపిణీ చేశారు. ఈ సారి నెలకు ముందే అధికార వైసీపీ చీరలు,కుక్కర్లు వంటివి ఇవ్వడం అలవాటు చేసింది. ఓటర్లకు పోలింగ్‌కు ముందు రూ.1000 నుంచి రూ.2500 వరకూ ఇచ్చారు. నియోజకవర్గంలో సుమారు 2 లక్షల మంది ఓటర్లు ఉంటే.. అందులో సుమారు లక్ష ఓట్లను కొనాల్సిన పరిస్థితి. ఇతర పార్టీ వాళ్లను కూడా కొనే ప్రయత్నం చేయగా, కొందరు తమ ఓటరు కాదనుకునేవాళ్లకు పైసా కూడా ఇవ్వకూడదని నిర్ణయించుకోవడం గమనార్హం. కొన్ని ప్రాంతాల్లో ఓటర్లకు డబ్బులు ఇవ్వకుండా తాయిళాలు పంచడానికి రూ.కోట్లు ఖర్చయింది.కొందరు మధ్యవర్తులు చేతివాటం చూపించడం గమనార్హం. ఈసారి అభ్యర్థులు చాలా పగడ్బందీగా పంపిణీ చేసినప్పటికీ చాలా చోట్ల చేతివాటం జరిగింది.ఆయా వార్డులు, గ్రామాల్లో పనిచేసే నేతలు,డబ్బు పంపిణీలో కీలకంగా వ్యవహరించే వ్యక్తులు కొందరికి ఇచ్చి, కొందరికి ఇవ్వకుండా చేసిన ప్రయత్నాలు ఉన్నాయి.ఇది అభ్యర్థికి తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి. తనకు తెలిసిన వాళ్లను ఎవరినైనా తోడుగా పెట్టి పంపిణీ చేద్దామంటే అదిగో.. మా మీద నమ్మకం లేనప్పుడు మేం ఎందుకు పనిచేయాలని బెదిరింపులు.ఇటువంటి పరిస్థితుల్లో అభ్యర్థులు రూ.కోట్లు ఖర్చు చేశారు. మీడియాలో ప్రచారానికి, మద్యం ..భోజనాలు ఇలా అంతా ఖర్చే. జిల్లాలో రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు,ఏడు అసెంబ్లీ నియోజవర్గాలు ఉన్న సంగతి తెలిసిందే. పార్లమెంట్ అభ్యర్థికి మరింత ఎక్కువ ఖర్చు ఉంటుంది. పార్లమెంట్ అభ్యర్థి తన ఖర్చు తాను చూసుకోవడంతో పాటు, ఇబ్బందిగా ఉన్న చోట్ల తమ పార్టీ అసెంబ్లీ అభ్యర్థులకు డబ్బు ఇవ్వవలసిన పరి స్థితి ఉంటుంది.ఇలా ప్రతీ నియోజకవర్గంలో ఓట్ల కోసం కోట్లు కుమ్మరించారు. ఒక్కో నియోజకవర్గంలో కనీస ఖర్చు రూ.25 కోట్లుగా ఉంటే ఎక్కువ ఖర్చు రూ.40 కోట్లకు పైగా ఉందని అంచనా.ప్రధాన పార్టీ అభ్యర్థులకే ఎక్కువ ఖర్చు ఉంటుంది.స్వతంత్ర అభ్యర్థులు నామమాత్రమే. ఎవరైనా విరాళాలు ఇస్తారేమోనని ఎదురు చూసేవారు ఉంటారు.

నిఘా విఫలం

ఎన్నికల కమిషన్ నియమావళి చాలా బాగుంటుంది. ఓటర్లను ఎవరూ ప్రలోభపెట్టకూడదు. అభ్యర్థులు కూడా చాలా పరిమితంగా వ్యయం చేయాలి. కానీ వీటిని అమలుచేయడానికి నియమితులైన అధికారులు ప్రలోభాలకు లోబడడం వల్ల ఎన్నికల కమిషన్ ఆశయం నీరుగారిపోతోంది.. ఎన్ని చెక్‌పోస్టులు పెట్టినా, ఎన్ని మొబైల్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినా.. ఎంతమందిని తనిఖీ కోసం నియమించినా, ఏ నియోజకవర్గంలోనూ డబ్బు పంపిణీ ఆగలేదు. ఎన్నిక ముందు అక్కడక్కడా అధికారులు కొద్దిగా హడావుడి చేసి రూ.లక్షో, రూ.50 వేలో తీసుకుని వెళ్లేవారిని కొంతమందిని పట్టుకున్నారు. ఆధారాలు చూపితే తర్వాత ఇచ్చారు. కొంత ఆధారాలు లేని సొమ్ము దొరికింది. చెక్‌పోస్టుల వద్ద కార్లు, ఇతర వాహనాలను తనిఖీ చేశారు. కార్లలో బ్యాగ్‌లు వాటిని చూసి వీడియో తీసి ఏమీ లేకపోతే వదిలేశారు. మోటారు సైకిళ్లను ఎక్కడా తనిఖీ చేయలేదు. రూ.లక్షల కొద్దీ సొమ్ము పోలీసు కళ్లుగప్పి ఆయా ప్రాంతాలకు చేరిపోయింది. నల్లజర్ల వద్ద ఒక వ్యాన్‌కు బోల్తా పడడం వల్ల ఏకంగా రూ.7 కోట్ల ఎన్నికల సొమ్ము బయటపడింది. అక్కడ యాక్సిడెంట్ జరగకపోతే..ఆ డబ్బు గురించి తెలిసేది కాదు. కమర్షియల్ ట్యాక్స్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేసినా వారు కేవలం జీఎస్‌టీ వరకే పరిమిత మయ్యారు. వారి లోపాల వల్ల కూడా సరుకు బాగా వచ్చేసింది. మద్యం ఏరులై పారింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు నామమాత్రంగా వ్యవహరించారు. అక్కడక్కడా కొద్దిగా పట్టుకుని చూపించారు. ప్రభుత్వ అధికారులు, లిక్కరు వ్యాపారులు కుమ్మక్కయి ఎన్నికలకు ముందే మద్యాన్ని తరలించారు. బార్లలో రేట్లు పెం చేశారు. అంతేకాదు సారా ఏరులైపారింది. ఇదంతా లెక్క లు వేస్తే ఒక్కో నియోజకవర్గానికి అందరు అభ్యర్థుల మొత్తం ఖర్చు కలిపి రూ.100 కోట్లు దాటేసింది.



అమ్మో రూ.200

మార్కెట్‌లో నకిలీ నోట్లు చలామణి

అనపర్తి, మే 16 : జిల్లాలో నకిలీ నోట్ల చలామణి పెరిగింది.. రూ.100, 200,500 నోట్లు నకిలీ మకిలీ అంటించుకున్నాయి. దీంతో దుకాణాల వద్ద ఏ నోటు ఇచ్చినా అయ్యబాబోయ్ అంటున్నారు.. ఒకసారి చూసి తీసుకుంటున్నారు. నకిలీ నోటు పట్ల అవగాహన ఉన్న వారు పరవాలేదు.. లేని చిరు వ్యాపారులు మాత్రం భారీగా మోసపోతున్నారు. అనపర్తిలో నకిలీ నోట్ల చలామణీ ఇటీవల ఊపందుకుంది. గతంలో రూ.500,రూ.1000 నకిలీ నోట్ల చలామణి అధికంగా జరిగేది. అయితే పెద్ద నోట్ల రద్దు తరువాత నకిలీ నోట్ల చలామణీ గణనీయంగా తగ్గింది. గతంలో కొత్త రూ.500 నకిలీ నోట్లు వచ్చినప్పటికీ పెద్దగా ప్రభావం చూపలేదు. ప్రస్తుతం మార్కెట్‌లో నకిలీ రూ.200 నోట్లు చలామణిలోకి రావడంతో ఇటు ప్రజలు అటు వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. అనపర్తిలో అయితే రూ.200నోటు చూడగానే అమ్మో రూ.200 నోటా అంటూ పరిశీలించి మరీ తీసుకుంటున్నారు. ఈ నోట్ల చలామణితో అనేక మంది పేదలు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. అనపర్తి పరిసరాల్లో నోట్ల తయారీ కేంద్ర ఉండి ఉండవచ్చనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.ఎటువంటి అనుమానం రాకుండా అసలు నోట్లకు దీటుగా రూ.200 నోటు ఉండటంతో పరీక్షగా చూస్తే తప్ప తేడాను కనిపెట్టలేకపోతున్నారు.చిన్న నోటు అయితే పెద్దగా ఇబ్బంది ఉండదనే కోణంలో రూ.200 నోట్లు చలామణిలోకి తెచ్చి ఉంటారని సమాచారం.నోట్ల చలామణీ పెరిగి సామాన్యులు ఇబ్బందులు పడకుండా పోలీస్ యంత్రాంగం నకిలీ నోట్ల తయారీపై దృష్టి సారించాలని వ్యాపారులు కోరుతున్నారు.

చేయూత పడేదెప్పుడో!

- ఈబీసీ నేస్తం సంగతేంటో?
- సీఎం సార్ బటన్ నొక్కారు..వదిలేశారు
- ఐదు నెలలవుతున్నా అందని సొమ్ములు
- లబ్ధిదారుల ఎదురుచూపులు
- అధికారుల వద్ద కానరాని సమాచారం

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)



ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం పథకాలకు బటన్ నొక్కారు. అయితే నేటి వరకు ఒక్క ఆసరా సొమ్ములతోనే సరిపెట్టి మిగిలిన ఈబీసీనేస్తం, చేయూత పథకాలకు ప్రభుత్వం మెండిచేయి చూపడంతో లబ్ధిదారులు ప్రభుత్వ తీరుపై మండి పడుతున్నారు. ఎన్నికల కోడ్ వచ్చే ముందు సీఎం జగన్ మూడు పథకా లకు బటన్లు నొక్కడం తరువాత ప్రతి గ్రామంలోను ప్రజాప్రతినిధులు సమావేశాలు నిర్వహించి భారీ చెక్కులతో ఫొటోలు దిగడం మినహా ఇప్పటి వరకు పథకాల సొమ్ము పడిన దాఖలాలు లేవు. పోలింగ్ ముందు ఈసీ ఒక్క రోజు అవకాశం ఇచ్చినా ప్రభుత్వం మాత్రం లబ్ధిదారులకు సొమ్ములు చెల్లించడంలో విఫలమైంది. మూడు పథకాల్లోను ముఖ్యంగా ఈబీసీ నేస్తం,చేయూత పథకాలపై రాష్ట్రంలోని మహిళలు అనేక శలు పెట్టుకున్నారు.ఎట్టకేలకు డ్వాక్రా మహిళలకు ఆసరా కింద డబ్బు పడినట్టు చెబుతున్నారు. వాస్తవానికి జనవరి 23వ తేదీన అనంతపురం జిల్లాలో సీఎం జగన్ ఆసరా సొమ్ము జమ చేస్తున్నట్టు బటన్ నొక్కారు. సుమారు 4 నెలలైన తరువాత జిల్లాలో కొంత మంది డ్వాక్రా మహిళలకు గురువారం బ్యాంక్ అకౌంట్లలో డబ్బు జమచేశారు. జిల్లాలో 3,18,930 మంది డ్వాక్రా సభ్యులు ఉన్నారు. వారికి రూ.11.07 కోట్లు జమచేయవలసి ఉంది. అందులో కొందరికి పడినట్టు చెబుతున్నారు. ఈ మేరకు లెక్కలేవీ తమకు తెలియదని అధికారులు చెప్పడం గమనార్హం. అయితే సీఎం జగన్ మాత్రం బటన్ నొక్కి మీ ఖాతాల్లో డబ్బులు పడిపోయాయని చెబుతుంటారు. నాలుగో విడత వైఎస్ఆర్ చేయూత పథకం పంపిణీ కింద గతేడాది డిసెంబర్ 28న అనకాపల్లిలో సీఎం జగన్ బటన్ నొక్కారు. కానీ ఇప్పటికీ ఆ డబ్బు ఆయా ఖాతాల్లో జమకాలేదు. జిల్లాలో 85,311 మంది లబ్ధిదారులకు రూ.150.96 కోట్లు జమకావలసి ఉంది. ఐదు నెలలు దాటేసింది. ఎన్నికల కమిషన్ ఎన్నికలు పూర్తయ్యే వరకూ ఇవ్వొద్దని ఆదేశించిందని, ప్రతిపక్షాలు పంపిణీలను అడ్డుకున్నాయని వైసీపీ ప్రభుత్వం తెగబొంకిన సంగతి తెలిసిందే. ఇంకా ఈబీసీ నేస్తం కింద,కాపు,ఇతర కులాల మహిళలకు చేయూత సొమ్ము ఇంతవరకూ జమకాలేదు. ఐదేళ్లలో ఐదు సార్లు అందించాల్సిన పథకాలు కొన్ని మూడు విడతలు, కొన్ని నాలుగు విడతలతో సరిపెట్టడంతో ప్రభుత్వం నుంచి తామెంత లబ్ధిని కోల్పోయామనే లెక్కలు వేసుకుంటూ మహిళలు చర్చించుకుంటున్నారు.



తీపర్రులో అధికారులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్లు

అధికారులు వస్తున్నారని.. ఆపేశారా!

- రెండు నెలలుగా సాగుతున్న ఇసుక తవ్వకాలు
- అయినా పట్టించుకోని అధికారులు
- గురువారం తీపర్రు ర్యాంపులో హడావుడి
- అప్పటికే సర్దేసిన నిర్వాహకులు

పెరవలి, మే 16 : జిల్లాలో ఇసుక తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగు తున్నాయి. జిల్లా అధికారులంతా ఉండే రాజమహేంద్రవరంలోనూ ఇదే పరి స్థితి. కడియం మండలం బుర్రిలంక ఇసుక ర్యాంపులో బుధవారం రాత్రి ఇసుక తవ్వకాలు జరిపారు.పెరవలి మండలం తీపర్రు ఇసుక ర్యాంప్ వద్ద ఇదే పరిస్థితి.గత రెండు మూడు నెలలుగా ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికా రులకు కనపడలేదు. ఏవో అనుమ తులు పేరుతో పరిమితులకు మించి లోతుగా తవ్వడం గోదావరికి అడ్డుగా బాటలు వేయడం జేసీబీలతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరపడం, పరి మితికి మించి తవ్వడం వంటి నిబంధనలు తుంగలో తొక్కి లారీలకు ఎటువంటి రశీదులు ఇవ్వకుండా తవ్వకాలు జరిగినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. అయితే ఏమైందో ఏమో కానీ కొంత మంది అధికారులు గురువారం ఉదయం తీపర్రు ఇసుక ర్యాంప్‌కు వచ్చారు. అక్కడి ర్యాంప్ తవ్వకం దారులకు ముందుగా సమాచారం అందిందో ఏమో కాని అధికారులు వచ్చేసరికి గోదావరిలో ఉండే ఎక్స్‌కవేటర్లు గట్టు మీదకు చేరుకున్నాయి. లారీలను కూడా ఏమి లేకుండా బయటకు తరలించారు. అక్కడ ఇంత వరకు ఉపయోగించిన పుస్తకాలు గాని ఏమి లేకుండా జాగ్రత్త పడ్డారు. అయితే అధికారులు సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చామని చెప్పడం విడ్డూరం. ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపినప్పటికి అధికారులు ఇప్పటి వరకు కళ్ళకు గంతలు కట్టుకున్నారు. సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసినప్పటికి అధికారులు కూడా తప్పుడు రిపోర్టుతో కోర్టును కూడా మోసగించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఎన్నికలు జరిగిన రాష్ట్ర ప్రభుత్వానికి పరిమిత అధికారాలు ఉండడంతో అధికారులు కూడా తమపై ఎటువంటి ఆరోపణలు వస్తాయోనన్న ఉద్దేశంతో ఇప్పుడిప్పుడే బయట పడుతున్నారు.అధికారులు వస్తున్నారని గురువారం ఆపివేసిన తవ్వకాలు శుక్రవారం కొనసాగుతాయా.. లేదా అనేది వేచి చూడాలి.

రెండు ఎక్స్‌కవేటర్లు.. రెండు లారీలు సీజ్..

తీపర్రు ఇసుక ర్యాంపులో మైనింగ్ అధికారులు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు నిర్వహించారు.మైనింగ్ ఏడీ సుబ్రహ్మణ్యంను కలిసి ఇక్కడకు రావడానికి గల కారణాలు ఇక్కడ తవ్వకాలపై ఏం చర్యలు తీసుకున్నారనే దానిపై విలేకరులు వివరణ కోరగా ఆయన వివరాలు చెప్పడానికి నిరాకరించారు. తాము ఉన్నతాధికారులకు మాత్రమే నివేదిక సమర్పిస్తామని మా స్థాయిలో ఎటువంటి సమాచారం చెప్పకూడదని దాట వేశారు. అయితే ఇక్కడ తవ్వకాలకు అనుమతి ఉందా లేదా అని అడగ్గా 2025 వరకు ప్రతిమ కంపెనీకి ఇసుక తవ్వకాలకు అనుమతి ఉందని తెలిపారు. అనుమతి ఉన్నప్పుడు ఇక్కడకు తనిఖీలకు ఎందుకు వచ్చారని ప్రశ్నించగా సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చామని బదులిచ్చారు. ఇక్కడ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా అని ప్రశ్నించగా మేము వచ్చే సమయానికి ఎటువంటి తవ్వకాలు జరగడం లేదని రెండు ఎక్స్‌కవేటర్లు,రెండు లారీలు మాత్రం ర్యాంప్ పైభాగంలో లంక భూమిలో ఉన్నాయని వాటిని సీజ్ చేశామని తెలిపారు. ఇక్కడ తవ్వకాలపై ఎవరైనా ఫిర్యాదు చేశారా అని ప్రశ్నించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు. ఇక్కడ స్థానిక లారీ డ్రైవర్లు ఆయన వద్దకు వెళ్లి తమకు ఇసుక ఎగుమతి చేసినప్పటికి తమకు ఎటువంటి రశీదులు ఇవ్వడం లేదని చెప్పగా దీనిపై తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు.ఆయనతో పాటు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.



కళ్లు మూసుకున్నారా?: రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో షెల్లార్ లేకుండా నిర్మించిన భవనం



చేతులు తడిపెయ్.. అక్రమంగా కట్టెయ్!

అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు

- భవన నిర్మాణానికో రేటు
- ప్రజాప్రతినిధి పేరు చెప్పి అజమాయిషీ
- వారు చెప్పిందే వేదం
- చోటా నాయకుల దోపిడీ
- కాదంటే రంగంలోకి ప్రజాప్రతినిధి
- నోర్మూసుకుంటున్న అధికారులు
- రాజమహేంద్రవరంలో ఇదీ తీరు

రాజమహేంద్రవరం సిటీ, మే 16 : ఇద్దరు ఐఏఎస్ అధికారులు ఉన్నారు.. ఒకరు జిల్లాకు అధికారి అయితే.. మరొకరు రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు అధికారి.. అయినా అక్రమార్కులకు అడ్డే లేదు.. అనుకున్న రీతిన.. నిబంధనలకు వ్యతిరేకంగా కట్టేస్తున్నారు.. అయినా అడిగే నాథుడే లేడు..ప్రశ్నించే అధికారీ లేడు.దీంతో జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిపోయింది. గతంలో ఏదైనా భవనం నిర్మించాలంటే దానికి అవసరమైన అనుమతులన్నీ ముందుగానే తీసుకుని అటుపై ఆ ప్లాన్లు, అనుమతుల ప్రకారం నిర్మాణాలు జరిగేవి. కానీ గత ఐదేళ్లుగా రాజమహేంద్రవరంలో అడ్డగోలు నిర్మాణాలు అధికమయ్యాయి. రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలెన్నో.. అయినా అటు వైపు కన్నెత్తి చూసేవారే లేరు.నిబంధనల ప్రకారం రాజమహేంద్రవరంలో భవనం నిర్మించాలంటే షెల్లార్లు తప్పనిసరిగా ఉండాలని కానీ నగరంలో షెల్లార్లు లేకుండానే బహుళ అంత స్తుల భవన నిర్మాణాలు జరిగిపోతున్నాయి. వాటిపై అధికారులు చర్యలు తీసుకునే పరిస్థితులు లేవు. ఎందుకంటే అధికార పార్టీ ప్రజాప్రతినిధి పేరు చెప్పడం కొన్నింటిని స్వయంగా ఆ ప్రజాప్రతినిధే సమర్థించడంతో అక్రమ కట్టడాలకు అజ్యం పోసినట్లయ్యింది. నిబంధనలకు విరుద్ధంగా చిన్నపాటి షెడ్లు,నిర్మాణాలు చేస్తే టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే వాటిని కూల్చివేస్తారు.. అలాంటిది యథేచ్ఛగానిర్మాణాలుసాగుతున్నా చోద్యం చూస్తున్నారు.

కమిషనర్ ఏం చేస్తున్నారు?

రాజమహేంద్రవరంలో అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను తొలగించేందుకు తొలుత వేగంగా చర్యలు తీసుకున్న కమిషనర్ దినేష్ కుమార్ ఇటువంటి ఘటనల పట్ల ఎందుకు స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆరు నెలల కిందట కొన్ని అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపించిన కమిషనర్ అటుపై వాటిని వదిలేశారు. కొన్ని భవనాలకు సంబంధించి నోటీసులు ఇచ్చారు. మరికొన్ని కోర్టులో ఉన్నాయి. కానీ షెల్లార్లులేకుండా కొత్తగా భవనాలు ఎలా నిర్మించారు. అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.అక్రమ భవనాలను అడ్డుపెట్టుకుని లక్షలు దండుకున్న ప్రజాప్రతినిధి వారి అనుచరుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమ నిర్మాణాలకు రేట్ ఫిక్స్

ప్రజాప్రతినిధి అనుచరులమంటూ కొందరు వ్యక్తులు పుట్టుకొచ్చి రాజమహేంద్రవరంలో అక్రమ నిర్మాణాలకు వారివారి వ్యక్తిగత ట్యాక్స్‌లు వేసేస్తున్నారు. దారుణంగా అక్రమాలకు రేట్లు ఫిక్స్ చేసేశారు. దీంతో రాజమహేంద్రవరంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధికి వారి మనుషులకు అక్రమ భవన నిర్మాణాలు కాసులు కురిపిస్తున్నాయి.ప్రజాప్రతినిధికి మెయిన్ రోడ్డులో ఇద్దరు అనుచరులు ఉన్నారు. ఆ ప్రాంతంలో నూతనంగా భవనాలు నిర్మించాలనుకుంటే ముందుగానే వారిని సంప్రదించి లక్షలాది రూపాయలు ప్యాకేజీ ఇచ్చుకుంటే వారు ఆయా భవనాలకు అడ్డగోలు అనుమతులిచ్చేస్తున్నారు.ఇందులో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి.. ఎవరైనా ప్రశ్నిస్తే సదరు అనుచరులు వారి నాయకుడితో ఫోన్లు చేయించడం చేస్తున్నారు. ఇలా మెయిన్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు సాగుతున్నాయి.అయితే కట్టడాలకు డబ్బులు చెల్లించని యజమానులు తమకు అడ్డులేదని భావించి వ్యాపారాలు చేసుకుంటున్నారు.కానీ వాస్తవానికి ఆయా భవనాలకు షెల్లార్లు లేకపోవడం కొన్ని ప్లాన్లకు విరుద్ధంగా ఉండడంతో ఎప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుంటే కూల్చివేత తప్పదనే భయాందోళనలో ఉన్నారు. కానీ ప్రజాప్రతినిధి అనుచరులు మాత్రం ఇప్పటికే లక్షలాది రూపాయలు దోచేయడంతో వారికేమి పోయేదిలేదని ధీమాలో ఉన్నారు.

వరదలను సమర్థవంతంగా ఎదుర్కొందాం

సమాయత్త సమావేశంలో డెల్టా సీఈ సతీష్‌కుమార్



వరదలపై సమాయత్త సమావేశం నిర్వహిస్తున్న సీఈ సతీష్‌కుమార్

ధవళేశ్వరం, మే 16: రానున్న వరదల సీజన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొందామని గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్‌కుమార్ అన్నారు. గురువారం ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ జి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్లడ్‌బ్యాంక్స్ పటిష్టమైన నేపథ్యంలో బలహీనంగా ఉన్న గట్లను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్ల ఔట్‌ఫాల్ స్లూయిజ్ షెట్టర్లు రిపేర్లు చేసి పటిష్ట పరచాలన్నారు. వరదలను ఎదుర్కోవడానికి ఫడ్ స్టోర్స్‌లో ఫ్లడ్ మెటీరియల్ సిద్ధం చేయడానికి ఏర్పాట్లు చేయాలని ఎస్ఈకి సూచించారు. సమావేశంలో హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, తూర్పుడెల్టా ఈఈ వీవీ రామకృష్ణ, సెంట్రల్ డెల్టా ఈఈ శ్రీనివాస్, డ్రైనేజ్ డివిజన్ ఈఈ సుబ్బయ్య, వైఎస్‌సీ డివిజన్ ఈఈ విజయభాస్కర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

19 నుంచి మదన గోపాలుడి కల్యాణోత్సవాలు



నిడదవోలు, మే 16: నిడదవోలులోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ మేనేజర్ నామా సూర్య ప్రకాశరావు, ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధనం దుర్గాప్రసాదాచార్యులు తెలిపారు. 19న మదనగోపాలస్వామి కల్యాణోత్సవం, 20న గ్రామోత్సవం, 21న విష్ణు, లక్ష్మి సహస్రనామాలు, 22న విశేష పూజలు, 23న చక్రస్నానం పూర్ణాహుతి, పుష్పయాగోత్సవం, పవళింపు సేవా నిర్వహించనున్నామని చెప్పారు.

వేంకటేశ్వరస్వామి హుండీ లెక్కింపు



పెరవలి, మే 16: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు శుక్రవారం నిర్వహించారు. దేవాలయ అధికారి ఎంపీ రామయ్య ఆధ్వర్యంలో 50 రోజులకు లెక్కింపగా రూ.3,70,291 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో ఎం.రాధాకృష్ణ తెలిపారు.

తాళ్లపూడిలో వేసవి విజ్ఞాన శిబిరం

తాళ్లపూడి, మే 16: తాళ్లపూడిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేసినట్టు గ్రంథాలయాధికారి నరేష్ తెలిపారు. జూన్ 7వ తేదీ జరిగే ఈ శిబిరాన్ని విశ్రాంత ఉపాధ్యాయుడు జి.సూర్యనారాయణ, కొందరు చదువరుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ గ్రామర్ రాయించడం, చదివించడం, మాట్లాడించడం నేర్పిస్తారని, ప్రతిరోజూ కార్యక్రమంలో పోటీలు జరుగుతాయని, చివరి రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని గ్రంథాలయానికి పంపించాలని కోరారు.

రేపటి నుంచి బ్యాడ్మింటన్‌లో ఉచిత శిక్షణ

కొవ్వూరు, మే 16: కొవ్వూరు బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో అవంతీ ఫౌండేషన్ సహకారంతో ఉచిత వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్టు అకాడమీ కార్యదర్శి పొట్రు మురళీ తెలిపారు. స్థానిక సత్యవతినగర్‌లోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి జూన్ 18వ తేదీ వరకు ఈ శిబిరం నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు సీనియర్ కోచ్‌లు కెనడి, కె.సతీష్ శిక్షణ అందిస్తారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రమణమూర్తికి అచ్చిబాబు పరామర్శ

కొవ్వూరు, మే 16: కొవ్వూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది ఐవీ రమణమూర్తి తండ్రి ఈదూరి బాలభాస్కరరావు మృతికి టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు సంతాపం తెలిపారు. బాలభాస్కరరావు ఇటీవల మృతి చెందారని తెలుసుకున్న అచ్చిబాబు గురువారం రమణమూర్తి నివాసానికి చేరుకుని పరామర్శించారు. ఆయన వెంట అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మద్దుల సత్యనారాయణ, పులగుర్త శర్మ తదితరులు ఉన్నారు.

దైవచింతనతో ఉండాలి



కీర్తనలు ఆలపిస్తున్న సంఘ సభ్యులు

నల్లజర్ల, మే 16: నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం దైవజనులు ఎస్.ప్రేమరాజు అన్నారు. గురువారం అచ్చన్నపాలెంలోని కాకర్ల గంగరాజు కళ్యాణ మండపంలో పాస్టర్ సీహెచ్ మత్తయి ఆధ్వర్యంలో 14వ వార్షిక క్రీస్తు సమాధాన సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమరాజు మాట్లాడుతూ పేద వారి పట్ల దయ కలిగి ఉండాలని, ప్రతి కుటుంబం, గ్రామం, రాష్ట్రం, రాజకీయ నాయకుల్లో శాంతి సమాధానాలు కలగాలని దేవుడిని ప్రార్థించాలన్నారు. ప్రతి విశ్వాసి పరిశుద్ధత వైపు పయనించాలన్నారు. క్రీస్తు ఆజ్ఞలను అనుసరించాలని చెప్పారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

వేంకటేశ్వరుడి వార్షిక బ్రహ్మోత్సవాలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు, ఆలయ ముఖద్వారం



దేవరపల్లి, మే 16: దేవర పల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం, బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయం త్రం శోభాయయాత్ర, సేనాధిపతి విశ్వక్‌సేన తిరువీధి ఉత్సవం, పుణ్యాహవాస నం, రక్షాబంధనం, దీక్షాధారణ, అంకురారోహణం, ధ్వజ పటవాస్తు, మంగళశా సనం చేపట్టారు. పూజా హోమ కార్యక్రమాలు ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు దంపతులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

దేవరపల్లి, మే 16: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించగా గోపాలపురం మండలం చిట్యాల గ్రామంలో మద్యం బాటిళ్లతో ఒక ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ కేవీ.స్వామి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కూటమి ఆత్మీయ సమావేశం

నల్లజర్ల, మే 16: మండలంలోని అనంతపల్లి ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగే కూటమి ఆత్మీయ సమావేశానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఈ ఎన్నికల్లో కష్టపడిన ప్రతి కార్యకర్త, నాయకుడు ఈ సమావేశానికి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఓటెత్తిన పల్లె

- పెరవలిలో 86 శాతం పోలింగ్ నమోదు
- ఓటింగ్‌లో పాల్గొన్న 49,653 మంది ఓటర్లు
- 2019 ఎన్నికల కంటే సుమారు 3 శాతం అధికం



తీపర్రులో ఓటేసేందుకు లైన్‌లో నిలబడిన మహిళలు(ఫైల్)

పెరవలి, మే 16: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈ నెల 13న జరిగిన పోలింగ్ మండలంలోని ఆయా గ్రామాల్లో అధికశాతం పోలింగ్ నమోదైంది. కొన్నిచోట్ల నిర్దేశిత సమయం దాటి పోలింగ్ జరిగింది. ఇదిలా ఉండగా 2019లో జరిగిన ఎన్నికల్లో 82.7శాతం పోలింగ్ నమోదు కాగా ఈ సారి 86శాతం పోలింగ్ నమోదైంది. కొన్ని బూత్‌లలో 90శాతం మించి ఓటింగ్ జరిగింది. మండలంలో అత్యధికంగా వెంకట్రాయపురంలో 93శాతం పోలింగ్ నమోదు కాగా, తక్కువగా పెరవలి, ఖండవల్లిలో 80శాతం మాత్రమే నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు. మండలంలో 18 గ్రామాల్లో 56 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం ఓటర్లు 57,709 కాగా, దీనిలో పురుషులు 28,563, మహిళలు 29,146 ఉండగా మొత్తం 49,653 ఓట్లు పోలయ్యాయి. దీనిలో మహిళలు ఓట్లే ఎక్కువగా పోలైనట్టు చెబుతున్నారు. గ్రామాల వారీగా పోలైన ఓట్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నడిపల్లి 87శాతం, కానూరు 86శాతం, కానూరు అగ్రహారం 87శాతం, ఉసులుమర్రు 88శాతం, తీపర్రు 90శాతం, కాకరపర్రు 85శాతం, వెంకట్రాయపురం 93శాతం, అజ్జరం 87శాతం, పెరవలి 82శాతం, ముక్కామల 87శాతం, కాపవరం 88శాతం, కొత్తపల్లి 86శాతం, నల్లాకులవారిపాలెం 88 శాతం, ఖండవల్లి 82శాతం, మల్లేశ్వరం 89శాతం, అన్నవరప్పాడు 89శాతం, పిట్లవేమవరం 89శాతం, కడింపాడు 81శాతం పోలైనట్టు అధికారులు తెలిపారు. అయితే కొన్ని పోలింగ్ బూత్‌లలో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండడంతో సకాలంలో ఓట్లు వేయలేని కొంతమంది ఓటు వేయకుండానే ఇళ్లకు వెళ్లి పోయారని, లేదంటే పోలింగ్ శాతం మరింత పెరిగేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



అనపర్తి: రామవరంలో ఓటు వేసేందుకు లైన్‌లో వేచి ఉన్న ఓటర్లు(ఫైల్)

ఓటింగ్‌లో రంగంపేట టాప్

అనపర్తి లీస్ట్.. జిల్లాలో నియోజకవర్గానికి మూడో స్థానం

అనపర్తి, మే 16: ఈనెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో 86.23శాతం ఓటింగ్‌తో జిల్లాలో మూడో స్థానంలో నిలిచింది. కాగా నియోజకవర్గ పరిధిలో రంగంపేట మండలం 88.88శాతం పోలింగ్‌తో మొదటి స్థానంలో నిలవగా అనపర్తి మండలం 85.43శాతం చివరి స్థానంలో నిలిచింది. నియోజకవర్గంలో మొత్తం 2,26,053మంది ఓటర్లు ఉండగా 1,94,924మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 96,161 కాగా మహిళలు 98761 మంది, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనపర్తి మండలంలో 59,886మంది ఓటర్లకు గాను 51148మంది ఓటు హక్కును వినియోగించుకోగా 85.43శాతం నమోదైంది. బిక్కవోలు మండలంలో 57,684మంది ఓటర్లకు గాను 49,413మంది ఓటు హక్కును వినియోగించుకోగా 85.66శాతం నమోదైంది. పెదపూడి మండలంలో 60,265మంది ఓటర్లకు గాను 51,539 మంది ఓటింగ్‌లో పాల్గొనగా 85.52శాతం నమోదైంది. రంగంపేట మండ లంలో 48,180మంది ఓటర్లు ఉండగా 42,824 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 88.88శాతం నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే నియోజకవర్గ పరిధిలో సుమారు పదివేల మంది ఓటర్లు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెండ్యాల అచ్చిబాబు

కూటమిదే విజయం

- నాయకులు, కార్యకర్తల కృషి మరువలేనది
- ధన్యవాద సభలో టీడీపీ సీనియర్ నాయకుడు అచ్చిబాబు

కొవ్వూరు, మే 13: ఈ ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని, ఎన్నికల కార్యక్రమాల్లో అహర్నిశలు పనిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల కృషి మరువలేనిదని టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు) అన్నారు. కొవ్వూరులోని యువరాజ్ కళ్యాణ మండపంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో గురువారం కూటమి నియోజకవర్గ ఆత్మీయ ధన్యవాద సభ నిర్వహించారు. అచ్చిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఈ ఎన్నికలు ధ్రువీకరించాయన్నారు. కూటమి అభ్యర్థులైన ముప్పిడి వెంకటేశ్వరరావు, దగ్గుబాటి పురందేశ్వరి గెలుపునకు మూడు పార్టీల కార్యకర్తలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న యువత కష్టపడి పనిచేశారన్నారు. సీనియర్ సిటిజన్స్ సైతం లైన్‌లో నిలబడి ఓట్లు వేశారని, వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ పరిశీలకులు గొర్రెల శ్రీధర్ మాట్లాడుతూ అభ్యర్థి ఎంపిక నుంచి పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు సైకో పాలనను తరిమికొట్టడానికి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎనలేని కృషి చేశారని, అభ్యర్థులకు అత్యధిక మెజార్టీ ఖాయమన్నారు. ఐదేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు అధికారంలోకి వచ్చిన తరువాత సముచిత స్థానం కల్పించాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు అభిమానం మరువలేనిదన్నారు. జనసేన, బీజేపీ కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో చాలా కృషిచేశారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా, కేంద్రంలో మోదీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఈ సందర్భంగా అచ్చిబాబు, ముప్పిడి వెంకటేశ్వరరావులను సత్కరించి, బుద్ధుడి ప్రతిమను బహూకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, కోడూరి లక్ష్మీనారాయణ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నామన పరమేష్, మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఆళ్ల హరిబాబు, అర్జిల్లి రామకృష్ణ, జనసేన నాయకులు డేగల రాము, సుంకర సత్తిబాబు, బీవీ ముత్యాలరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, బీజేపీ నాయకులు ఎం.రామచంద్రరావు, పెరుగు పోతురాజు, ఈ.రామకృష్ణ, మద్దిపాటి రాఘవులు, కేతా సాహెబ్, ఉప్పులూరి చిరంజీవి, పిక్కి నాగేంద్ర, జెట్టి బంగారయ్య పాల్గొన్నారు.

బీఈడీ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, మే 16: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యాకళాశాల సహాయాచార్యులు ఎం.గోపాలకృష్ణ సహరచయితగా రాసిన పుస్తకాన్ని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. ప్రభుత్వ తెలుగు, సంస్కృత అకాడమీలో బీఈడీ మొదటి సంవత్సరానికి చెందిన భౌతిక, రసాయన శాస్త్ర బోధనాభ్యసనశాస్త్రం-1 అనే పుస్తకాన్ని ఆవిష్కరించామని వీసీ తెలిపారు. పుస్తకరచనకు సహకరించిన విశ్వవిద్యాలయ అధికారులకు, అధ్యాపకులకు గోపాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

19న రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 16: జిల్లా చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యిలోని ది ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్లో రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 17వ తేదీ లోపు www.apchess.org ద్వారా నమోదు చేసుకోవాలని చెప్పారు. క్రీడాకారులకు భోజన వసతి సదుపాయం కల్పించనున్నట్టు ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వై.కళ్యాణ్‌కుమార్ చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్.62812 50967ను సంప్రదించాలని కోరారు.

రంగంపేటలో వేసవి శిక్షణ తరగతులు



రంగంపేటలో సరస్వతీదేవి చిత్రపటానికి నమస్కరిస్తున్న దృశ్యం

రంగంపేట, మే 16: వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తి వెలికి తీయవచ్చునని రంగంపేట గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన స్థానిక గ్రంథాలయంలో ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు వజ్రపు వెంకటరమణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం బాలల పుస్తకాలతో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు జూన్ 7వ తేదీ వరకు నిర్వహిస్తామని, శిబిరంలో నీతి కథలు చెప్పడం, తెలుగు వ్యాకరణం, స్పోకెన్ ఇంగ్లీషు, పేపర్‌క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

వాసవీమాతకు విశేష పూజలు



ధవళేశ్వరం, మే 16: వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. యువ వైశ్య ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతానగరం, మే 16: మండలంలోని చినకొండేపూడి సబ్‌స్టేషన్ నుంచి 33/11 కేవీ లైన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 17, 18 తేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. దీంతో చినకొండేపూడి, సీతానగతరం నాగరత్నం కాలనీలకు ఉదయం 7గంటల నుంచి 1గం. వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

రైల్వే స్టేషన్లో భౌ..బోయ్

- రైల్వే స్టేషన్‌లో కుక్కల స్వైర విహారం
- బెంబేలెత్తిపోతున్న ప్రయాణికులు
- పట్టించుకోని రైల్వే అధికారులు



రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో పడుకున్న కుక్కలు



రాజమహేంద్రవరం, మే 16(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌జీ-2 హోదా కలిగిన రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషన్‌ని కుక్కల బెడద వీడడం లేదు. ఈ స్టేషను గుండా రోజుకు సుమారు 10వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగి స్తారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయితే, శునకాలు మాత్రం రోజంతా స్వైర విహారం చేస్తుంటాయి. అలసట పడిన ప్పుడు ప్లాట్‌ఫాంలపై ఎక్కడపడితే అక్కడ నిద్రకు ఉపక్రమిస్తున్నాయి. ప్రయాణికుల వెయిటింగ్ హాల్స్‌లో కూడా ఇవి దర్శనమిస్తున్నాయి. మొదటి ప్లాట్‌ఫాంపై శునకాల బెడద ఎక్కువగా ఉంది. రైలు ఎక్కే హడావుడిలో కాలు, లగేజీ వాటికి తగిలితే ప్రయాణికులను కరవడానికి మీదకు వస్తున్నాయి. వ్యాధులు సోకిన కుక్కలు కూడా ఉండడంతో కరిస్తే కచ్చితంగా ప్రాణాలు పోతాయంటూ ప్రయాణికులు బెంబేలెత్తిపోతు న్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు హడలిపోతున్నారు. ఎండల తీవ్రత ఎక్కువ అవుతుండడంతో సాధారణంగా కుక్కలు కాస్త తీవ్ర స్వభావం చూపిస్తుంటాయి. దీంతో రైలు ప్లాట్‌ఫాంకు వచ్చే సమయంలో కుక్కలకు భయపడి ఏ మాత్రం పట్టుతప్పినా ప్రయాణికులు పట్టాలపై పడిపోయే ప్రమాదం పొంచివున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఏదైనా ప్రమాదం జరిగితే గానీ మేలుకోరా? అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. కుక్కలు ప్లాట్‌ఫాంలపై తిరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమిస్తే గానీ ఫలితం కానరాని పరిస్థితి ఉంది.

ప్లాట్‌ఫాంపై నిద్రపోతున్న కుక్క



రైల్వే స్టేషన్లో ప్రయాణికుడి వద్ద కాపు కాసుకుని ఉన్న కుక్క



ప్లాట్‌ఫాం నుంచి బయటకు వెళ్లే దారికి అడ్డంగా పడుకున్న కుక్కలు

డెంగీని నివారిద్దాం

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు



రాజమహేంద్రవరం సమావేశంలో పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్‌వో

రాజమహేంద్రవరం కల్చరల్, మే 16: ప్రజలతో చేయి చేయి కలుపుదామని, డెంగీ వ్యాధిని నివారిద్దామని, సమర్థవంతమైన సమాజ భాగస్వామ్యంతో వ్యాధిని తరిమికొడదామని అవగాహన కల్పించడంలో మనమంతా ముందుండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. జాతీయ డెంగ్యూ నివారణా దినం సందర్భంగా గురువారం స్థానిక వై-జంక్షన్ వద్ద ఉన్న కంబాలపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. దీనికి డీఎంఅండ్‌హెచ్‌వో ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్, డాక్టర్ లావణ్య, బి.రాజు, కె.బాపిరాజు, డీడీ భవాని, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కొవ్వూరులో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు: కొవ్వూరు క్రిస్టియన్‌పేట యూహెచ్‌సీలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ దినాన్ని నిర్వహించారు. విలేజ్ హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లకు డెంగీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ డ్రై డే ఫ్రై డే ఆవశ్యకత, డెంగీ వ్యాధిపై ప్రజల్లో ఏ విధంగా అవగాహన కలిగించాలో, యాంటీ లార్వల్ ఆపరేషన్ చేపట్టే విధానాలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని కె.సావరంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ అర్ఎస్ ప్రసాద్ మాట్లాడారు. ప్రజల సహకారంతో డెంగీ వ్యాధిని నివారించవచ్చని వైద్య సిబ్బందికి సూచించారు. దోమలు వల్ల వచ్చే ఈ వ్యాధితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమతెరలు వాడాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు పెరుగుతాయని, వర్షాకాలంలో ఇంటి ఆవరణ చుట్టు నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది జి.శ్రీనివాసరావు, రత్నకుమారి, సంధ్యాలక్ష్మి, విజయ్, చిరంజీవి, రాము, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.90.45 లక్షలు



ఆత్రేయపురం, మే 16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి హుండీ కానుకలు లెక్కింపు నిర్వహించారు. పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, పీవీవీఎస్ కామేశ్వరరావు, బి.కిరణ్ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. 31 రోజులకు గాను ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.67,40,864, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.23,04,541 వెరశి రూ.90,45,405 ఆదాయం లభించింది. బంగారం 14 గ్రాములు, వెండి 710 గ్రాములు, వివిధ దేశాల కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ డీసీ, ఈవో భూపతి రాజు కిషోర్‌కుమార్ తెలిపారు. అలాగే క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీ ఆదాయం 2,30,472 ఆదాయం లభించింది. ఈ లెక్కింపులో బ్యాంకు సిబ్బంది, పోలీసులు, దేవస్థాన సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	లవ్‌గురు
వై.స్క్రీన్2	ఫ్యామిలీ స్టార్
దేవిశ్రీ(గాయత్రి)	మంజుమ్మల్ బాయ్స్
అనన్య	డీజే టిల్లు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	గాడ్జిల్లా వర్సెస్ కాంగ్
రాధాకృష్ణ	ఆ ఒక్కటి అడక్కు
శ్రీగణపతి	గీతాంజలి మళ్లీ వచ్చింది

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి